



సర్పంచ్‌లకు.. పూర్వవైభవం





- వలంటీర్ల రాజ్యంలో చిన్నబోయిన గ్రామ పెద్ద
- నిధులు, విధులు మీవేనంటూ పంచాయతీ కమిషనర్ స్పస్టీకరణ
- ఉమ్మడి జిల్లా లోని 1172 ప్రెసిడెంట్ లకు పూర్వ వైభవం
- గ్రామ స్వపరిపాలన కు ప్రాణం పోసిన కూటమి ప్రభుత్వం

గుంటూరు సిటీ, జూలై 31 : ఒకప్పుడు గ్రామ సర్పంచ్ అంటే మకుటం లేని మహారాజు. ఊర్లో అన్ని పనులు ఆయన చేతుల మీద గానే జరిగేవి . విద్యుత్ దీపం దగ్గర నుండి విందు, వినోదం వరకు సర్పంచ్ అన్నీతానై నిర్వహించేవారు. ఆ హోదా ఆ దర్పం ఒక రేంజ్‌లో ఉండేది. జగన్ ప్రభుత్వం స్థానిక స్వపరిపాలన సంస్థలను నిర్వీర్యం చేసింది. సర్పంచ్ అనే మాటకు అర్థాన్ని మార్చివేసింది. వలంటీర్ల రాజ్యంలో ప్రజలు ఎన్నుకున్న గ్రామ పెద్ద చిన్నబోయాడు. కేవలం ఉత్సవ విగ్రహం గానే మిగిలి పోయాడు . విధులు లేవు. నిధులు లేవు. ఏదో పేరుకే అలా పదవిలో ఉన్నారు. ఊరికి ఏదో చేద్దామన్న ఆశతో కోట్లు ఖర్చుపెట్టి మరీ కొంతమంది ఉన్నత విద్యావంతులు కూడా సర్పంచులుగా పదవులు చేపట్టారు. జగన్ ప్రభుత్వంలో అసలేమీ చేయలేమని అర్థం అయిపోయి ఎంతగానో కృంగిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ సర్పంచులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తుంది. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే మిగిలిపోయిన వారికి ప్రాణం పోసేందుకు నడుంకట్టింది. గ్రామ స్వపరిపాలన సంస్థ పూర్తిగా సర్పంచ్ కనుసనల్లోనే నడిచే విధంగా చర్యలకు ఉపక్రమించింది. ఈ పరిణామం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 మంది సర్పంచులకు ఆనందాన్ని కలిగిస్తున్నది . గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519,బాపట్ల జిల్లా లో 426 మంది సర్పంచులకు ఇది ఆనందం కలిగించే విషయం.

పంచాయతీ సొమ్ము పక్కదారి

జగన్ ప్రభుత్వం సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చటమే కాకుండా ,పంచాయతీ నిధులను పక్కదారి పట్టించింది.గడచిన ఐదేళ్ళ కాలంలో గ్రామీణ ప్రాంతాలకు కొద్ది పాటి నిధు లు కూడా విదల్చలేదు.కేంద్రం ఇచ్చిన 15 ఆర్థిక సంఘం నిధులు రూ .42 కోట్ల ను పక్కదారి పట్టించింది. చాలా మంది సర్పంచ్‌లు కరోనా సమయంలో అప్పులు చేసి మరీ పారి శుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వాటిని కూ డా ప్రభుత్వం విడుదల చేయలేదు. కరెంటు బిల్లులు చెల్లించేందుకు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేం దుకు సర్పంచ్‌లు తలలు పట్టుకోవాలిసిన పరిస్థితిని కలిగించింది.

అసలు సర్పంచు అంటే ఎవరు...

సర్పంచి అంటే అధికారులకు, గ్రామీణ సమాజానికి మధ్య వారధి లాంటి వారు.స్థానిక స్వపరిపాలన సంస్థ భారత రాజ్యాంగ బద్ధంగా రూపుదిద్దుకున్న చట్టబద్ధత కలిగిన సంస్థ. గ్రామానికి సర్పంచి ప్రథమ పౌరుడు. అక్కడ ఆయన చెప్పిందే వేదం. అంతటి ప్రాధాన్యం , చట్టబద్ధత కలిగిన పదవిని జగన్ తీసుకువచ్చిన సచివాలయ సమాంతర వ్యవస్థ పూచిక పుల్లతో సమానంగా చేసింది.˝ సచివాలయం ఏర్పడి వలంటీర్లు వచ్చాక ప్రజలకు సర్పంచ్‌తో పెద్దగా పనిలేకుండా పోయింది. గ్రామ కార్యదర్శి, వలంటీర్లు ఊరిలో నిర్ణయాత్మక శక్తిగా మారిపోయారు. ఏదో ఉన్నారంటే వున్నారు అన్న విధంగా ఆ పదవిని దిగదార్చారు.

బాధలన్నీ పోయినట్లే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తో సర్పంచ్ లు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్ష లో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులను పాత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్న విషయాన్ని అధి కారులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఆ విషయం పై దృష్టి సారించాలని ఆయ న ఆదేశించటంతో నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

సర్పంచ్‌లతో కమీషనర్ భేటీ

ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ రాష్ట్రంలోని సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో తమ ఇబ్బందులను సర్పంచుల సంక్షేమ సంఘం నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇక మీదట గ్రామాల్లో అన్ని కార్యక్రమాలు కేవలం సర్పంచి చేతుల మీద గానే జరుగుతాయని డైరెక్టర్ హామీ ఇచ్చారు. నిధులు, విధులు అన్నీ మీవే అని స్పష్టం చేశారు. స్థానిక స్వపరిపాలన చట్టానికి లోబడి సర్పంచి పూర్వ వైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిన 5 వ ఆర్థిక సంఘం కూడా ఏర్పాటు చేసి నిధులు విడుదల చేస్తామని చెప్పటం తో సర్పంచు ల్లో ఆనందం వెల్లువెత్తుతుంది.

తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం..



గత ప్రభుత్వం వల్ల గ్రామానికి ఏమి చేయలేక తలదిం చుకొనే పరిస్థితి. ఇప్పుడు మాకు భరోసా వచ్చింది. ఊరికి ఏదో ఒకటి చేసే అవకాశం వచ్చింది. ఇంక తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం.మా విధులు నిర్వర్తించి ఊరికి ఉపకారిగా మారుతాం. పంచాయతీలకు, సర్పంచులకు పూర్వ వైభవం వచ్చినట్లే.

- చిలకలపూడి పాపారావు
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం

మా ఊరు.. మేము..



మాకు ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఏదో ఒకటి చేస్తామని. ఐదేళ్లు ఏమి చేయలేదు. కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగా మాత్రమే ఉన్నాం .ఇప్పుడు మా ఊరికి మేలు చేసే అవకాశం ఉంటుంది.

- పూల నాగమణి,మేడికొండూరు పంచాయతీ సర్పంచ్

సర్వం సిద్ధం

- పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- 7.78 లక్షల మందికి రూ.316.84 కోట్లు విడుదల
- లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియ నూరుశాతం పూర్తి
- ఈ నెలలోనూ సచివాలయ సిబ్బంది ద్వారానే పంపిణీ
- కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

అవ్వాతాతలు.. దివ్యాంగులకు గురువారం ఉదయం ఆరు గంటలకే పింఛన్ అందచేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. గత నెలలో ఎదురైన సమస్యలు ఈ సారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మూడు రోజుల ముందుగానే నగదును ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారుల ప్రక్రియను సచివాలయ సిబ్బంది బుధవారం సాయంత్రానికే నూరు శాతం పూర్తి చేశారు. గురువారం తెల్లవారగానే లబ్ధిదారుల ఇంటికెళ్లి సచివాలయ సిబ్బంది నగదు అందచేయనున్నారు. సర్వర్ సమస్య రాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు.

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధమయింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7 లక్షల మందికి పింఛన్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులే ఈసారి కూడా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయను న్నారు. గురువారం ఉదయం 6 గంటలకే పింఛను పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు జిల్లాల్లోని 7.78 లక్షల మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.316.84 కోట్లు ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమయ్యా యి. మూడు రోజుల ముందుగానే నగదు జమ కావడంతో బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని ఉద్యోగులు పంపిణీకి సిద్ధమయ్యారు.


ఉదయం 6 గంటల నుంచే..

పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 6 గంటలకల్లా ప్రారంభం కావాలని అధికారులు ఇప్పటికే సచివాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. గత నెల ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్రమాన్ని లాంఛ నంగా ప్రారంభించడంతో పంపిణీ కొంచెం ఆలస్యమైం దని, ఈసారి అలాంటి జాప్యం జరగడానికి వీలులేదని అధికారులకు తేల్చి చెప్పారు. గత నెలలో తలెత్తిన సర్వర్ సమస్యలు కూడా రాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. ఒక్కో సచివాలయ ఉద్యోగి 50 నుంచి 100 మందికి పింఛన్లు ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కిందటి నెలలో వచ్చిన చిన్నపాటి సమస్యలు కూడా రాకుండా ముందుగానే లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న 7లక్షల 78 వేల మంది లబ్ధిదారులకు ఒక్కరోజులోనే పింఛన్ అందజేయాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. గుంటూరు జిల్లాలో సాధారణ పించనుదారులు 2 లక్షల 58 వేల 768 మంది ఉండగా, దివ్యాంగులు 2,802 మంది ఉన్నారు. వారికి రూ.110.69 కోట్ల నిధులు విడుదలయ్యాయి. పల్నాడు జిల్లాలో 2 లక్షల 79 వేల 975 మంది సాధారణ పింఛనుదారులు, 3వేల మంది దివ్యాంగులకు రూ.112 కోట్లు విడుదల య్యాయి. బాపట్ల జిల్లాలో సాధారణ పింఛనుదారులు 2 లక్షల 33వేల 102 మంది, దివ్యాంగులు 2,300 మంది ఉండ గా వారికి రూ.94 కోట్లు విడుదల య్యాయి. మొత్తంగా మూడు జిల్లాల్లో 7లక్షల 78 వేల మందికి రూ.316.84 కోట్లు విడుదలయ్యాయి.

పాల్గొననున్న ప్రజా ప్రతినిధులు

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. వారి ద్వారానే లబ్ధిదారులకు పింఛను అందజేయనున్నారు. ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా వాటిని వాయిదా వేసుకుని విధిగా ప్రతి నెలా పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

బియ్యంతో సరి



- రెండో నెలలోనూ రేషన్ అంతే
- కార్డుదారులకు కందిపప్పు, పంచదార లేనట్లే
- ప్రైవేట్ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూ.లక్షల విలువైన వాహనం.. ఓ డ్రైవర్, ఓ సహాయకుడు.. సైరన్ మోగించుకుంటూ వచ్చి ఇచ్చేది.. బియ్యం మాత్రమే. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అంటూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యంతో సరిపెట్టింది. కూటమి ప్రభుత్వంలోనూ ఇదే పంథా రెండు నెలలుగా కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీని నిలిపివేశారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే రేషన్‌లో కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని సరఫరా చేస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూశారు. అయితే జూలైలో మాదిరిగానే ఆగస్టులో కూడా కందిపప్పు పంపిణీ జరగదని తెలిసి పేదలు ఉసూరుమంటున్నారు. అక్కడక్కడ ఏదో కొంతమందికి మాత్రం గత నెలలో సరఫరా జరిగినట్లు తెలుస్తోంది. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ఉంది. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ.67 ఇవ్వాల్సి ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో కిలోకు రూ.100 నుంచి రూ.110 వరకు అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాయితీ పై కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కందిపప్పు, పంచదార పంపిణీని ప్రభుత్వం దాదాపుగా నిలిపివేసింది. పల్నాడు జిల్లాలో 6,45,110 తెల్ల కార్డులు ఉన్నాయి. ఒక్కోక్క కార్డు దారునికి కనీసం కిలో కందిపప్పు అందజేయాలి. అయితే 1.35 శాతం కార్డుదారుల కు మాత్రమే సరఫరా చేసినట్టు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయలేదు. ఏడు ప్యాకెట్లు మాత్రమే అందజేయడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డుదారులెవ్వరికూ కూడా కందిపప్పు సరఫరా కాలేదు.

ఎయిమ్స్‌కు కొలనుకొండ భూముల పరిశీలన


తాగునీరు, మౌలిక సౌకర్యాల కల్పన పనులు పూర్తిచేయాలి

మంగళగిరి సిటీ, జూలై 31: ఎయిమ్స్ విస్తరణకు కొలనుకొండలోని భూములను పరిశీలించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికను 15 రోజుల్లో అందించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున కల్పించాల్సిన మౌలిక సౌకర్యాల పనుల పురోగతిపై బుధవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎయిమ్స్‌కు 4 ఎంఎల్‌డీ వాటర్ పైపు లైను పనులు వెంటనే పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ పనులు పూర్తయ్యే వరకు నీటి ఎద్దడి లేకుండా అదనంగా అందించే అవకాశాలను పరిశీలించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంటీఎంసీ అధికారులకు సూచించారు. మంగ ళగిరి వైపు నుంచి రహదారి విస్తరణ, పైపులైన్ల ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతుల కోసం ఆర్అండ్‌బీ, ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖలు అటవీ శాఖ అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు త్వరి తగతిన పూర్తిచేయాలన్నారు. వైద్య విద్యార్థుల శిక్షణ కోసం మంగళగిరి పరిసర ప్రాంతాల్లోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలను కేటాయించే అంశమై ప్రతిపాదనలను పంపించాలని సూచించారు. సమా వేశంలో ఎయిమ్స్ డైరెక్టర్, సీఈవో ప్రొఫెసర్ మధుబానందకర్, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డీఆర్వో పెద్ది రోజా, ఎయిమ్స్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, అకడమిక్ డీన్ డాక్టర్ శ్రీమంత్‌కుమార్‌దాస్, సూపరింటెండెంట్ ఇంజనీరు ఎల్‌టీ కల్నల్ రవిశంకర్‌సిన్హా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నటరాజ్, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఈఈలు సుబ్బారెడ్డి, సమర్పణరావు, డిప్యూటీ రేంజ్ ఫారెస్టు ఆఫీసర్ గిరిబాబు, డీఎఫ్‌వో ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఎయిమ్స్‌లో మౌలిక సౌకర్యాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా హరికృష్ణ



- మధ్యాహ్నం ఉత్తర్వులు.. సాయంత్రం బాధ్యతల స్వీకరణ
- గుంటూరు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 31: గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎస్ హరికృష్ణ బుధవారం బాధితులు చేపట్టారు. కార్పొరేషన్ లోని కమిషన్ ఛాంబర్‌లో ఆయన బాధ్యత తీసుకున్నారు. గుంటూరు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ)గా ఈ నెల 29న బాధ్యతలు స్వీకరించిన హరికృష్ణకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ డైరెక్టర్ హరినారాయణ ఉత్తర్వులు జారీ చేయగా సాయంత్రం హరికృష్ణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లబ్ధిదారులకు పింఛన్లు ఇంటి వద్దనే నూరు శాతం జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. పెన్షన్ల పంపిణీలో సమస్య రాకుండా నోడల్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సచివాలయాల వారీగా విధులు కేటాయించిన నోడల్ అధికారులు పెన్షన్ల పంపిణీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గురువారం సాయంత్రానికి పూర్తిగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులు మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం విభాగాధిపతులు, అధికారులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంహెచ్‌వో మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ దినేష్‌కుమార్ రానట్లేనా?

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్ బదిలీల్లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కొత్తమాసు దినేష్‌కుమార్ నియమించింది. రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రభుత్వం గుంటూరుకు బదిలీ చేసింది. గతంలో ఆయన నెల్లూరు, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్‌గానే పనిచేశారు. ఈ నేపథ్యంలో మూడోసారి కూడా కమిషనర్ పోస్టుపై దినేష్‌కుమార్ అంతగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో గుంటూరుకు వచ్చి బాధ్యతలు స్వీకరించలేదు. ఇక్కడ కమిషనర్ కీర్తి రిలీవ్ అవడంతో పది రోజులుగా ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎస్ఈ శ్యామ్‌సుందర్ వ్యవహరించారు. దినేష్‌కుమార్ విషయం తేలకపోవడంతో ప్రభుత్వం ఆర్డీ హరికృష్ణకు కార్పొరేషన్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడం.. ఆ వెంటనే ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

డీఎస్పీలకు స్థానచలనం

తొలి జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొమ్మిది మంది బదిలీ

గుంటూరు, జూలై 31: ఎట్టకేలకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భారీగా డీఎస్పీల బదిలీల కు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం 96 మందితో తొలి జాబితా విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పలువురికి స్థానచలనం కలిగింది. గత సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉం చుకుని ఎన్నికల కమిషన్ నిబంధన లక నుగుణంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం డీ ఎస్పీ లను నియమించుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చి రెండు నెలలు గడు స్తున్నా గత ప్రభుత్వ హయాంలో నియ మితులైన వారే కొనసాగుతుండటంపై పార్టీ శ్రేణుల నుంచే కాక పోలీసు వర్గాల నుంచి కూడా విమ ర్శలు వ్యక్తమయ్యాయి. ఈ పరిస్థి తుల్లో ఎట్టకేలకు డీఎస్పీల బదిలీలపై రాష్ట్ర ప్రభు త్వం దృష్టి పెట్టింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వీవీ నాయుడు	ట్రాఫిక్, గుంటూరు	ఏసీపీ ట్రాఫిక్ , విజయవాడ
బీ జనార్ధనరావు	ఏసీపీ ట్రాఫిక్, విజయవాడ	తెనాలి
ఎం రమేష్	తెనాలి	డీజీపీ కార్యాలయం
పత్రిని శ్రీనివాసరావు	డీసీఆర్‌బీ, గుంటూరు	కాశీబుగ్గ
పీ మల్లికార్జునరావు	సీఐడీ గుంటూరు	దిశ, ఉమెన్ పీఎస్, విజయవాడ
సీహెచ్ రవికాంత్	నార్త్, గుంటూరు	డీజీపీ కార్యాలయం
ఎండీ మహబూబ్‌బాషా	సౌత్, గుంటూరు	డీజీపీ కార్యాలయం
సీహెచ్ శ్రీనివాసరావు	గురజాల	డీజీపీ కార్యాలయం
బీ ప్రసాద్	వెయిటింగ్	దిశ, ఉమెన్ పీఎస్, పల్నాడు

ఒకే అప్పు.. మళ్లీ మళ్లీ తీర్చాలి

- గుంటూరు జడ్పీలో వడ్డీల మాఫియా
- వైసీపీ రాబందుల చేతుల్లో ఉద్యోగులు విలవిల

గుంటూరు సిటీ, జూలై 31: ఎక్కడైనా ఒకసారి అప్పు తీసుకుంటే ఆ మొత్తం అందుబాటులోకి వచ్చిన తర్వాత చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఇక్కడ మాత్రం ఒకసారి అప్పు తీసుకున్న వారు వ్యాపారి అడిగి నప్పుడల్లా చెల్లిస్తూ ఉండాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా గుంటూరు జడ్పీలో చోటుచేసుకుంటున్న ఈ ఉదంతాలు తరచూ వెలుగుచూస్తున్నాయి. ఎంత ప్రభుత్వ ఉద్యోగం అయినా ఎప్పుడొకప్పుడు అప్పు చేయక తప్పదు. గుంటూరు జిల్లా పరిషత్‌లోని కొందరు కింది స్థాయి ఉద్యోగులు కూడా అదే రీతిలో అప్పు చేశారు. అధిక వడ్డీలు కట్టలేక బ్యాంకులో రుణం తీసుకుని ఆ అప్పులు తీర్చేశారు. అయినా వడ్డీ వ్యాపారికి ఆశ చావలేదు. చెక్కులు, ప్రామిసరీ నోట్లు అడ్డం పెట్టుకుని వేతన జీవులను వేధిస్తున్నారు. సంబంధంలేని వ్యక్తులతో చెక్‌బౌన్స్ కేసులు వేయించి ఒకే అప్పునకు మళ్ళీ మళ్ళీ డబ్బులు కట్టిస్తున్నారు. ఈ బాధలు భరించలేక కొందరు ఉద్యోగులు ఆత్మహత్య ప్రయత్నం కూడా చేసిన సందర్భాలు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

2016లో తీర్చినా మళ్లీ కేసు

మేడికొండూరు మండల పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్(అటెండర్)గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి గుంటూరులోని కొరిటపాడుకు చెందిన ఓ వడ్డీ వ్యాపారి వద్ద 2014లో రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సమయంలో హామీగా చెక్కు, ప్రామిసరి నోటు అందజేశారు. 2016 ఫిబ్రవరిలో బ్యాంకు నుంచి రుణం తీసుకుని అప్పు తీర్చినట్లు ఉద్యోగి చెబుతున్నారు. ఆ సమయంలో చెక్కు, ప్రామిసరీ నోటు అడగ్గా తర్వాత ఇస్తానని వడ్డీ వ్యాపారి దాటవేసినట్లు చెబుతున్నారు. తాజాగా సదరు ఉద్యోగికి నోటీసు అందడంతో అదిరిపోయారు. అప్పు తీసుకున్నట్లు నరసరావుపేటకు చెందిన వ్యక్తులతో కేసులు పెట్టించారు. నోటీసులు అందిన వెంటనే సదరుఉద్యోగి పోలీసులను ఆశ్రయించారు.

కోకొల్లలు..

గుంటూరు జిల్లా పరిషత్‌లో ఇటువంటి బాధితులు చాలా మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య ఉద్యోగ విరమణ పొందిన వారికి కూడా ఇదే రీతిలో నోటీసులు వచ్చినట్లు చెబుతున్నారు. ఎప్పుడో రుణం మొత్తం చెల్లించినా కొరిటిపాడుకు చెందిన మరో వడ్డీ వ్యాపారి అదే రీతిలో వేరే వ్యక్తులతో నోటీసులు పంపినట్లు బాధితులు వాపోతున్నారు. అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లించినా ఈ రీతిలో నోటీసులు పంపితే ఏమి చేయాలని ఉద్యోగులు వాపోతున్నారు.

వైసీపీ వాళ్లే..

జిల్లా పరిషత్ ఉద్యోగులను తప్పుడు కేసులతో వేధిస్తున్న వడ్డీ వ్యాపారులు వైసీపీకి చెందిన వారే అని బాధితులు చెబుతున్నారు. గతంలో కూడా ఇదే రీతిలో పలువురుని వేధించడంతో చాలా మంది గుండెపోటు వచ్చి ఆస్పత్రి పాలైనట్లు బాధితులు చెబుతున్నారు. ఎస్పీ ఈ విషయంలో జోక్యం చేసుకుని విచారిస్తే వడ్డీ వ్యాపారుల ఆగడాలు మరిన్ని వెలుగులోకి వస్తాయంటున్నారు.

వైసీపీ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవ్యస్తం



చీకటీగలపాలెం గ్రామం వద్ద గుండ్లకమ్మను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, ప్రక్కనే ఎమ్మెల్యే జీవీ

- ఐదేళ్ల కాలంలో కాలవలపై తట్ట మట్టి వేయని వైనం
- రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో..
- గుండ్లకమ్మకు మెయిన్‌కెనాల్ నుంచీ తూము ఏర్పాటు చేస్తాం
- నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

వినుకొండ, జూలై 31: ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవస్తమైదని, అప్పటి సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రంలోని ఏ తాగు నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టలేదని, మరమ్మతుల నిమిత్తం కాలవపై కనీసం తట్ట మట్టి వేసిన పాపాన పోలేదని భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జలహారతి కార్యక్రమం నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలం రానున్న నేపథ్యంలో బుధవారం ఏర్పాట్ల పరిశీలన కోసం మంత్రి నిమ్మల శ్రీశైలం వెలుతూండగా వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు చీకటీగలపాలెం, అడ్డరోడ్డువద్ద గల గుండ్లకమ్మ నదిని పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ..

నీటి పారుదలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 45 రోజుల్లో తాను ఉత్తరాంధ్ర పెన్నా, రాయలసీమ నీటి ప్రాజెక్టులను పరిశీలించాన్నారు. ఇరిగేషన్ వ్యవస్థను మాజీ సీఎం జగన్ రెడ్డి అస్తవ్యస్తం చేసి రైతులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు సమస్యల అధికంగా ఉందని, ఐదేళ్ళ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ఖాజానాపై రూ.14 లక్షలు కోట్లు అప్పులభారాన్ని మోపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్‌లో రూ.18 వేల కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అధిగమించే పనిలో ఉన్నామని తెలిపారు. పల్నాడు జిల్లా ప్రజల దాహార్తిని తీర్చాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమ దృష్టికి తీసుకు రాగా సీఎం చంద్రబాబుతో సహకారంతో కృష్ణా రివర్ బోర్డుతో చర్చించి కుడికాలవకు 5 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు విడుదల చేయించినట్లు తెలిపారు. కృష్ణాడెల్టా నీటి ప్రాధాన్యతను సమీక్షించి సాగర్ కుడి కాలువకు నీటి విడుదల కొనసాగిస్తామని తెలిపారు.

గుండ్లకమ్మకు రైట్ కెనాల్ నుంచి తూములు ఏర్పాటు చెయ్యాలి

నియోజకవర్గంలోని గుండ్లకమ్మ నదికి, ఈపూరు చెరువుకు నాగార్జున సాగర్ మెయిన్ కెనాల్‌నుంచి నీటి విడుదలపై తూముల ఏర్పాటుకు అనుమతి కల్పించాలని మంత్రి రామానాయుడును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. గతంలో కనుమల చెరువు, కంచర్ల చెరువుకు ఏవిధంగా ఎన్నెస్పీ నుంచి తూము అనుమతి ఇచ్చారో అదేవిదంగా దీనికి అనుమతివ్వాలని కోరారు. గుండ్లకమ్మ పరివాహక గ్రామాలకు రక్షత మంచినీటి పథకాలు, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలకు మంచినీటి పథకాలు ఉన్నాయని, వేసవి సయయంలో గుండ్లకమ్మ ఎండిపోయి తాగు నీరులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. అలానే 36 కిలో మీటర్లు ఉన్న గుండ్లకమ్మ నదిపై అక్కడక్కడ చెక్ డామ్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తప్పని సరిగి మెయిన్ కెనాల్ నుంచీ తూమ్ ఏర్పాటు చేస్తామని, అంచనాల అనంతరం గుండ్లకమ్మపై చెక్‌డ్యామ్ నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీ మండల అధ్యక్షుడు మాధినేని ఆంజనేయులు, నేతలు ముత్తినేని ఏడుకొండలు, మీసాల మురళీకృష్ణ, కర్నాటి వెంకటరెడ్డి, మద్దుకూరి రామబ్రహ్మం , పాటు నాయకులు, ఎన్నెస్పీ అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో పలు పదవుల భర్తీ

- నియామక ఉత్తర్వులు అందజేసిన ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, జూలై 31: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) లోని వివిధ స్థానాల్లో పదవులను భర్తీ చేసినుటట్ల ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్టూడెంట్‌సెల్(ఐఎస్‌సీ) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీ. పద్మావతి (జువాలజీ), ఉమెన్స్ స్టడీస్ సెంటర్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఈ.వీ. పద్మజ (హిస్టరీ), కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ)గా ఆలపాటి శివప్రసాదరావు నునియమించారు. ఈమేరకు వారికి నియామక ఉత్తర్వులను అందజేసినట్లు అందజేశారు. తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ కే.రత్నషీలామణిలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషిని శక్తివంచన లేకుండా అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఇసుక తవ్వకాలకు ముందు, తర్వాత పరిస్థితిని ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తున్న సీఎం

ఇసుక తవ్వకాలపై సీఎం సమీక్ష

- కేసులు నమోదు చేశామన్న అధికారులు
- రెవెన్యూని సైతం రికవరీ చేయాలని సీఎం ఆదేశం

గుంటూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలంలోని వీర్లపాలెంలో వైసీపీ హయాంలో ఇసుకని అక్రమంగా దోచేశారు. ప్రభుత్వ ఖజానాకు నామమాత్రంగానే నగదు జమచేసి అనుమతించిన దాని కంటే అదనంగా ప్రైవేటు ఏజెన్సీ ఇసుకని తోడేసింది. దీనిపై ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఉపగ్రహం ద్వారా చిత్రాలను సేకరించింది. అందులో లీజు ఇచ్చిన ప్రాంతం కంటే రెట్టింపు మోతాదులో ఇసుక తవ్వకాలు జరిగినట్లు స్పష్టమైంది. దీనిపై ఏమి చర్యలు తీసుకొన్నారని సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర మైనింగ్ అధికారులను బుధవారం ప్రశ్నించారు. కేవలం ఏడాది వ్యవధిలోనే వీర్లపాలెంలో లక్షల టన్నుల ఇసుకని తరలించేశారని నివేదించారు. దీని వలన రూ. కోట్ల నష్టం ప్రభుత్వ ఖజానకు వాటిల్లింది. ఈ అక్రమాలకు సంబంధించి కేసులు నమోదుచేయడమే కాకుండా, రెవెన్యూ రికవరీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో అప్పట్లో గుంటూరు జిల్లా మైనింగ్ అధికారులుగా పని చేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

గిరిజనుల సంక్షేమమే అజెండా

- నాటి ప్రభుత్వంలో నిలిచిన సేవలన్నీ త్వరలో పునరుద్ధరణ
- టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, జూలై 31: గిరిజనుల సంక్షేమమే తమ అజెండా అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్ తెలిపారు. బుధవారం ఆయన గుంటూరులో విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి గిరిజనుల సంక్షేమానికి బాటలు వేయడానికి ప్రణాళికలు రూపొందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజన పుత్రులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని, ఎస్టీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణ ఊసే లేకుండా గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేశారన్నారు. రోడ్లు లేక గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో డోలీలు కట్టుకుని కొండలు, గుట్టలు దాటాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారి నోచుకోని గ్రామాలకు కచ్చా రోడ్ల స్థానంలో తారు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. కొండ కోనల్లో కష్టాలతో సహవాసం చేస్తున్న గిరిజనులకు మేలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. గిరిజన పుత్రులకు ఆరోగ్య భరోసా కలిపిస్తూ 543 గిరిజన పాఠశాలలు, ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఏఎన్‌ఎం సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. 2014-2019 మధ్య అమలై ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఆదివాసి గర్భిణీ వసతి గృహాల పునరుద్ధరణ, గిరిజన తండాలలో డోలి మోతలు కనిపించకూడదని చంద్రబాబు ఆదేశించారన్నారు. ఎన్ని అవసరమైతే అన్ని చోట్లా ఫీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ధారూనాయక్ తెలి పారు. గిరిజన యువతను సరైన మార్గంలో నడిపించటానికి, ఉపాధి కల్పనకు యూత్ ట్రైనింగ్ సెంటర్స్‌లో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ధారునాయక్ తెలిపారు.



చెక్కు అందచేస్తున్న మంత్రి మనోహర్, సర్పంచ్ రమాదేవి, ఎంపీడీవో శిల్ప తదితరులు

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు రుణాలు పంపిణీ

తెనాలి రూరల్, జూలై 31: మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి చిన్నపాటి పరిశ్రమలు స్థాపించి వివిధ వ్యాపారరంగాల్లో అగ్రగాములుగా నిలుస్తూ ఆర్థికాభ్యున్నతిని సాధించేలా కృషి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని పెదరావూరు గ్రామంలో ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు రుణాలు పంపిణీ కార్యక్రమానికి మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 38 స్వయం సహాయక సంఘ గ్రూపులకు గానూ రూ. 5 కోట్ల 37 లక్షల చెక్కును మంత్రి మనోహర్ మహిళా సంఘాల గ్రూపులతో కలిసి విడదుదల చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా కోలుకోలేని దెబ్బతీశాడని ఆరోపించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా మహిళా సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పనిచేస్తున్నారన్నారు. అందులో భాగంగానే మహిళల స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు అందజేస్తున్నట్లు తెలిపారు. పొదుపులో మహిళలకు మించిన వారే లేరని వచ్చిన రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలను మహిళలకు వివరించారు. గత ప్రభుత్వంలో నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటాయని కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో నాణ్యమైన కందిపప్పు, బియ్యం వంటివి ప్రత్యేక స్టాల్స్ ద్వారా సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. మధ్యాహ్నభోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే ఆహారంపై దృష్టిపెట్టామని మరి కొద్దిరోజుల్లో మరింత నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీడీవో కానూరు శిల్ప, గ్రామ కార్యదర్శి రామసుబ్బారావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, మండలంలోని సంఘాల మహిళలు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

క్రీడలతో ఆలోచనాశక్తి, సామర్థ్యాలు వృద్ధి

- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
- ఉమ్మడి రాష్ట్రాల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూలై 31: క్రీడలతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి, ఇతర సామర్థ్యాలు పెంపొందుతాయని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గుంటూరు రూరల్, నల్లపాడు, లయోలా పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రీజియన్ ఐసీఎస్‌ఈ పాఠశాలల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ బాలికలు క్రీడల పోటీలలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. విద్యార్థి స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఎమెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ బాలికలు సామర్థ్యం కల్గిన బాస్కెట్‌బాల్ పోటీలను ఎంపిక చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రతిభకలిగిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పీ. ఆంటోని మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఉమ్మడి రాష్ట్రానికు చెందిన 45 జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. కార్యక్రమంలో లయోలా, స్టెమ్, లిటిల్ ఫ్లవర్, హోలీఫ్యామిలి (సత్తెనపల్లి) పాఠశాలల ప్రిన్సిపాల్స్ సురేష్, భరత్ రెడ్డి, ఎస్.సవేరి, విజయరాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే రామాంజనేయులు

టీడీపీ కార్యకర్తపై కత్తితో దాడి

- తృటిలో తప్పించుకున్న వైనం .. పోలీసులకు ఫిర్యాదు

మాచవరం, జూలై 31: వైసీపీకి కార్యకర్త షేక్‌మాబూవలి తనపై కత్తితో దాడచేశాడని టీడీపీకి చెందిన దరియావలి బుధ వారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తురకపాలెం గ్రామంలో వైసీపీ కార్యకర్త షేక్ మాబూవలి, అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ దరియావలిపై కత్తితో దాడికి యత్నించాడు. అయితే చాకచక్యంగా అతను తప్పించుకున్నాడు. తురకపాలెంలోవున్న వైసీపీ కార్యకర్తకు సంబంధించిన చికెన్‌స్టాల్‌ను దరియావలి మూయించాడనే నెపంతో దరియా వలిపై ఈ దాడికి పాల్పడ్డట్టు తెలిసింది. గతంలో ఇదే వైసీపీ కార్యకర్త గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై కొడవలితో దాడిచేసి చేతికి గాయం చేశాడు. గ్రామంలో చోటు చేసుకున్న ఈసంఘటనను తెలుసుకొని అతనిని పట్టుకొని మాచవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. జరిగిన సంఘటనపై షేక్ దరియావలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిరాదు మేరకు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

హైవేపై దారి దోపిడీ

- రూ. 4 లక్షలు నగదు లాక్కొని దుండగుల పరారీ

పెదకాకాని, జూలై 31 : హైవేపై కృష్ణా జిల్లా వాసి దారి దోపిడీకి గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా జి కొండూరు చెందిన పెద్ది సుబ్బారావు అనే వ్యక్తి తాను తీసుకున్న అప్పులు తీర్చే నిమిత్తం పెదకాకాని లోని తన కుమార్తె ఇంటికి వచ్చాడు. పత్తిపాడు గ్రామ సమీపంలోని కోయవారిపాలెంలో డబ్బులు ఇచ్చేందుకు పెదకాకాని నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సుబ్బారావును తక్కెళ్ళపాడు రోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఒక వ్యక్తి అడ్డగించాడు. కిందపడ్డ తన ఏటీఎం కార్డు తీసుకున్నామంటూ సుబ్బారావు గొడవ దిగి, అతని వద్ద ఉన్న రూ.4 లక్షల నగదును లాక్కుని పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని

యువకుడి ఆత్మహత్య

బొమ్మలరామారం, జూలై31: పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించటంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్‌ఐ అంజయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుజిల్లా రెంటచింతలకు చెందిన దావీదు 16 సంవత్సరాలుగా మల్యాల గ్రామ పరిధిలోని మామిడి తోటలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ముగ్గురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు బీటెక్, రెండో కుమారుడు డిగ్రీ చదువుతున్నారు. చిన్న కుమారుడు చంద్రశేఖర్(13) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఉదయం 8గంటలకు పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో బయలుదేరాడు. 10గంటల సమయంలో సమీపంలో ఉన్న మామిడితోటలో చెట్టుకు చంద్రశేఖర్ వేలాడుతుండటాన్ని చూసిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు కిందికి దించగా, అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 31: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం బుధవారం నాటికి 526.80 అడుగులు ఉంది. ఇది 161.96 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 5944 క్యూసెక్కులు, మొత్తం అవుట్‌ఫ్లో వాటర్‌గా 6844 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,18,622 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

2న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),జూలై 31: జిల్లా ఉపాధి కార్యాలయం (గుజ్జనగుండ్ల) ఆధ్వర్యంలో ఈనెల 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఫెయిర్ డీలర్ కాపిటల్, హెచ్1హెచ్‌ఆర్ సొల్యూషన్స్, క్యాప్‌స్టోర్ సర్వీసెస్ తదితర కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతవున్న వారు బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలతో ఈనెల 2న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఇతర వివరాల కోసం గుంటూరు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సార్వత్రిక విద్యాపీఠం(ఎపీ ఓఎస్‌ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య విధానంలో పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరుజిల్లా విద్యాశాఖాధికారి పీ.శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 28లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపాలని సూచించారు. అడ్మిషన్ ఫీజు ఇతర వివరాల కోసం www.apopenschool.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు రాజధాని అమరావతిలో


జంగిల్ క్లియరెన్స్ టెండర్ ఓపెన్

విజయవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు రూ.36.50 కోట్ల వ్యయంతో పిలిచిన టెండర్లను గురువారం సీఆర్‌డీఏ తెరవనుంది. వాస్తవానికి ఈ నెల 25నే టెండర్లను తెరవాల్సి ఉండగా.. 29 వరకు పొడిగించారు. తర్వాత మరో రెండు రోజులు పొడిగించారు. కాంట్రాక్టర్ల సందేహాలను నివృత్తి చేసేందుకే టెండర్ల గడువును పొడిగించినట్టుగా తెలుస్తోంది. గురువారం సాయంత్రంలోపు పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది.

జనసేన కార్యకర్తపై వైసీపీ నేతల దాడి

గురజాలటౌన్, జూలై 31: జనసేన కార్యకర్తపై వైసీపీ నేతలు దాడి జరిపిన సంఘటన గురజాల పట్టణంలో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన జనసేన కార్యకర్త పొలిశెట్టి కార్తీక్ తన స్నేహితుడిని కలిసి వస్తుండగా దండివాగు బ్రిడ్జివద్ద వైసీపీ నేతలు సుమారు 8మంది అతనిపై రాడ్లతో దాడిచేశారు. ఇంతలో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో వారు పరారయ్యారు. గాయాలపాలైన కార్తీక్‌ను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు రిఫర్ చేశారు. కాగా దాడిచేసిన వైసీపీ నేతలు దాచేపల్లి మండలం కొత్తూరుకు చెందిన వారని సమాచారం. కార్తీక్ ఫిర్యాదు మేరకు జక్కా అశోక్, బొజ్జా ప్రసాద్‌తోపాటు మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



పుట్టా నాగరాజు

ప్రత్తిపాడు, జూలై 31: అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని చినకోండ్రుపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన పుట్ట నాగరాజు (40) గత ఏడాది ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అందులో మూడు ఎకరాల మిర్చి, రెండు ఎకరాల పత్తితో పాటు ఒక ఎకరంలో కూరగాయలు సాగు చేశాడు. ఈ భూమికి కౌలుతో పాటు సాగు చేయడం కోసం తన ఇంటిని తాకట్టు పెట్టి రూ.13 లక్షలు అప్పు చేశాడు. గత ఏడాది పంటలు సరిగా పండక అప్పుల్లో మునిగి పోవడం, ఇదే తరుణంలో ఈ ఏడాది రెండు ఎకరాలు సాగుకు కౌలుకు తీసుకున్నాడు. అప్పులు తీర్చలేననే మనస్థాపంతో మంగళవారం తాను కౌలుకు తీసుకున్న పొలాన్ని దున్నిస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన నాగరాజు కూల్‌డ్రింగ్‌లో పురుగుమందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో పసువులు కాసే మహిళ జాతీయ రహదారికి పక్కన ఉన్న శ్రీనాద్ ప్లాట్స్‌కి సమీపంలో ఒక వేపచెట్టు కింద మృతదేహాన్ని గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాగరాజు భార్య రాజకుమారి ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

- తొలి జాబితాలో 24 మంది సీఐలకు పోస్టింగ్స్
- 15 మందిని వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు

గుంటూరు, జూలై 31: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సీఐల బదిలీలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు బుధవారం రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేసారు. తొలి జాబితాలో 24 మందికి పోస్టింగ్స్ ఇచ్చారు. అదేవిధంగా 15 మందికి ఎటువంటి పోస్టింగ్స్ ఇవ్వకుండా రేంజ్ వీఆర్‌కు పిలిచారు. ఇందులో ఒకరిద్దరి సీఐల పోస్టింగ్స్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా ఎమ్మెల్యేల సిఫార్సుల ఆధారంగా పోస్టింగ్స్ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో పలు చోట్ల పనిచేసిన వారికీ ఈ దఫా పోస్టింగ్ లభించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. వారిలో కొందరు గత ప్రభుత్వంలో తటస్థంగా చేసినప్పటికీ, కొందరు మాత్రం గత ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసినప్పటికీ వారికి ఎలా పోస్టింగ్ లభించిందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయా సీఐలు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రసన్నం చేసుకున్నప్పటికీ వారు ఎలా సిఫార్సు చేసారనేది చర్చనీయాంశంగా మారింది. బదిలీ అయిన సీఐల పేరు, ప్రస్తుత స్థానం, బదిలీ అయిన స్థానం వివరాలు..

టి విజయకృష్ణ - సీసీఎస్, ఒంగోలు - రాపూరు సర్కిల్, నెల్లూరు జిల్లా, పి సుబ్బారావు - రేంజ్ వీఆర్, గుంటూరు - వెంకటాచలం సర్కిల్, నెల్లూరు జిల్లా, మారీడు శ్రీనివాసరావు - రేంజ్ వీఆర్, గుంటూరు - చీరాల 1టౌన్, బాపట్ల, ఎం. విజయ్ చరణ్ - సోషల్ మీడియా, సైబర్ క్రైం, పల్నాడు - నరసరావుపేట 1 టౌన్, పల్నాడు, యు.శోభన్ బాబు - స్పెషల్ బ్రాంచ్ 2, పల్నాడు - వినుకొండ టౌన్, పల్నాడు, పసుపులేటి రామకృష్ణ - వేమూరు సర్కిల్, బాపట్ల- నరసరావుపేటరూరల్ సర్కిల్, పల్నాడు, బి.సుబ్బానాయుడు - ఎస్సీఎస్టీ సెల్,పల్నాడు - చిలకలూరిపేట సర్కిల్ , పల్నాడు, కె.వెంకట ప్రసాద్ - స్పెషల్ బ్రాంచ్ 3, గుంటూరు - అచ్చంపేట, పల్నాడు, ప్రత్తిపాటి సురేష్ - రేంజ్ వీఆర్ - పెదకూరపాడు, పల్నాడు, పొలూరి శ్రీనివాస్ - సత్తెనపల్లిటౌన్, పల్నాడు - సత్తెనపల్లి రూరల్, మోర్బనేని సుబ్బారావు - చీమకుర్తి (అటాచ్‌మెంట్) - చీమకుర్తి, ప్రకాశం, సీహెచ్ హజరత్తయ్య - దిశ, బాపట్ల - సింగరాయకొండ, ప్రకాశం, వై.నాగరాజు - రేంజ్ వీఆర్, గుంటూరు - ఒంగోలు 1 టౌన్, ప్రకాశం, కె. అజయ్ కుమార్ - మహిళా పీఎస్, నెల్లూరు -ఒంగోలు తాలూకా, ప్రకాశం, పి.వెంకటనారాయణ - నెల్లూరు(వేదాయపాలెం) 5వ పట్టణం - కలిగిరి సర్కిల్, నెల్లూరు, ఎ. మల్లికార్జునరావు - రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల - రేపల్లె టౌన్, బాపట్ల, పి. కిరణ్ - రేంజ్ వీఆర్, గుంటూరు- పట్టాభిపురం, గుంటూరు, ఎం.శేషగిరిరావు - రేంజ్ వీఆర్, గుంటూరు - మార్టూరు, బాపట్ల, కాకుమాను వెంకటరావు - సీసీఎస్, గుంటూరు - సంతమాగులూరు సర్కిల్, బాపట్ల, కొంకా శ్రీనివాస్- అరండల్ పేట (అటాచ్‌మెంట్) - అరండల్‌పేట, గుంటూరు, డి.వినోద్ కుమార్ - మంగళగిరి టౌన్(అటాచ్‌మెంట్) - మంగళగిరి టౌన్, గుంటూరు, యార్లగడ్డ శ్రీనివాసరావు - మంగళగిరి రూరల్(అటాచ్‌మెంట్) - మంగళగిరిరూరల్, గుంటూరు, కె.వంశీధర్ - నల్లపాడు(అటాచ్‌మెంట్) - నల్లపాడు, గుంటూరు, చిట్టెం కోటేశ్వరరావు - సీసీఎస్, నెల్లూరు - నెల్లూరు 1 టౌన్.

రేంజ్ వీఆర్‌కు పిలిచిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

పి.శేషగిరిరావు (చీరాల 1టౌన్, బాపట్ల), సి.కృష్ణారెడ్డి (నరసరావుపేట టౌన్, పలనాడు), సిరిగిరి సాంబశివరావు (వినుకొండటౌన్), కె. మల్లికార్జున (నరసరావుపేటరూరల్ సర్కిల్, పల్నాడు), పి.శ్రీనివాస రెడ్డి(చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు), కరీముల్లా షావలి(అచ్చంపేట), జి. మంగారావు (పెదకూరపాడు, పల్నాడు), ఎం.రాజేష్‌కుమార్ (సత్తెనపల్లిరూరల్), డి.రంగనాథ్ (సింగరాయకొండ, ప్రకాశం), ఎండి ఫిరోజ్ (కలిగిరి సర్కిల్ నెల్లూరు), ఎం.నజీర్ బేగ్ (రేపల్లెటౌన్, బాపట్ల), ఎస్ విజయచంద్ర (పట్టాభిపురం), ఎస్‌వి రాజశేఖర్‌రెడ్డి (మార్టూరు,బాపట్ల), కెనరసింహారావు (సంతమాగులూరు సర్కిల్, బాపట్ల), బి అశోక్‌కుమార్(నెల్లూరు 1 టౌన్, నెల్లూరు).

6న గద్దర్, చుండూరు అమరవీరుల సంస్మరణ సభలు

గుంటూరు(తూర్పు), జూలై 31: చుండూరు అమరవీరుల వర్థంతి, ప్రజా యుద్ధం ఒక గద్దర్ ప్రథమ వర్ధంతి సభ ఆగస్టు 6వ తేదీ, సాయంత్రం 4 గంటలకు స్థానిక బ్రాడీపేట, కొరటాల భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నేతలు తెలిపారు. సభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, కవి, సాహితీ విమర్శకులు ప్రొఫెసర్ జీ.లక్ష్మీనరసయ్య, వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.శౌరయ్య, సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరావు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శిఖా సురేష్, సాదు మాల్యాద్రి, వేల్పూరి నరసింహారావు, పాగళ్ల ప్రకాష్, గంటా ప్రభుదాసు పాల్గొన్నారు.

41,608 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 43,934 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 41,608 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,806 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17000	334	9000	12000
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	–	–
273	10000	11000	273	9500	10000
341	9000	16000	341	10000	15500
4884	--	–	4884	13000	14000
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18600	తేజ	9000	18600
బ్యాడిగి	8500	16300	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	10000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 31: విద్యుత్‌లైన్ల నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మంగళదాస్‌నగర్, సీతా రామనగర్, అరుంధతీనగర్, రాజగోపాల్‌నగర్, బీటీఆర్ నగర్, మద్దిరాలకాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేర్చుకోవాలనే తపనతో యువ ఇంజనీర్లు ముందుకెళ్లాలి

● విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



విద్యార్థులు వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), జూలై 31: యువత తమ జీవితాల్లో అన్ని భావోద్వేగాలను సమంగా చూడాలని, నిత్యం నేర్చుకోవాలన్న తపనతోనే ఉన్నత స్థాయి కి చేరతారని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. బుధవారం వడ్లమూడిలోని విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమైన సందర్భంగా ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే సంతోషం, బాధ, కష్టాలు, నష్టాలు, ఒడిదుడుకులు ఉంటేనే సంపూర్ణ జీవితం అవుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు ప్రణాళికాబద్ధంగా వారిని తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భం గా గత ఏడాది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్రకుమార్ తదితరులు అభినందించారు. మొత్తం 603 మందికి 840 ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్, వివిధ విభాగాల డీన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కేంబ్రిడ్జి యూనివర్శిటీలో ప్రతిష్టాత్మకమైన పెట్, బెక్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

పెన్షనర్ల ఫోన్ నెంబర్లు మారితే తంటాలే

● ఈదర వీరయ్య

గుంటూరు, జూలై 31: పెన్షనర్లు తరచూ సెల్‌ఫోన్ నెంబర్లు మార్చటంతో తంటాలు తప్పటం లేదని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య పేర్కొన్నారు. ఇటీవల నెంబర్లు మార్చటం సర్వసాధారణమై పోయిందన్నారు. కొన్ని కంపెనీలు బంపర్ ఆఫర్లతో ఉచితంగా సిమ్ కార్డులను జారీ చేస్తున్నాయని, మరికొన్ని కంపెనీలు ఉచిత టాక్ టైంను అందిస్తున్నాయన్నారు. ఇక బలహీన సంకేతాల (సిగ్నల్స్) సమస్యలతో నెంబర్లు మార్చేవారు లేకపోలేదన్నారు. దీర్ఘకాలికంగా వినియోగిస్తున్న వారు కూడా వివిధ కంపెనీలు ఇచ్చే బంపర్ ఆఫర్లతో సిమ్ మాయాజాలంలో పడి ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారన్నారు. అయితే నెంబరు మార్చిన వారు బ్యాంకులోను, తమ ఖాతాలో మార్చిన నెంబరు వారికి తెలియ చెప్పకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొంత మంది వినియోగదారులైతే రెండు మూడు నెలలకొకసారి సిమ్ నెంబర్లు మార్చేస్తున్నారన్నారు. ఇలా సిమ్‌కార్డులు తీసుకొనే నూతన వినియో గదారులు తంటాలు పడుతున్నారన్నారు. అలా కాకుండా చిన్నపాటి జాగ్రత్తలతో ఇలాంటి వాటిని అధిగమించవచ్చన్నారు. సాధారణంగా ఇలా ఫోన్ నెంబరు ఇవ్వాల్సిన చోట దీర్ఘకాలిక దృష్టితో ఆలోచించాలని, ఒకటి కంటే ఎక్కువ సిమ్‌లు వినియోగించే వారు ఏ ఖాతాకు ఏ నెంబరు అనుసంధాన నెంబరు ఇచ్చారో స్పష్టంగా డైరీలో రాసుకుంటే మంచిదన్నారు. ఉద్యోగులు తమ కార్యాలయ నెంబరు కూడా అనుసంధానం కోసం ఇస్తుంటారని, ఇలాంటి వారు ఒక్కటే సెల్ నెంబరు కాకుండా వ్యక్తిగత సెల్ నెంబరును కూడా అందుబాటులో ఉంచుకో వాలన్నారు. ఒకే నెంబరు ఉండటం వల్ల బ్యాంకులో ఖాతాలు ప్రారంభించినప్పుడు ఆ నెంబరు అనుసంధానం చేయటంతో మిస్డ్‌కాల్ సౌకర్యంతో ఖాతాల్లో ఎంత నిల్వ ఉన్నది, ఎంత డ్రా చేస్తున్నారనేది ఎప్పటికప్పుడు తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ వినియోగదారులందరూ తరచూ నెంబర్లు మార్చకుండా పోర్టబిలిటీ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వీరయ్య కోరారు.

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగదు

● బీపీ మండల్‌సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు(విద్య), జూలై 31: సామాజిక న్యాయానికి, కులగణనకు అండగా ఉన్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై బీజేపీ లోక్‌సభ సభ్యుడు అనురాగ్ ఠాగూర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని బీపీ మండల్‌సేన తీవ్రంగా ఖండిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 2018లో నేడు మంత్రిగా ఉన్న రాజ్‌నాథ్‌సింగ్ తాము అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఓబీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా ఓబీసీలను అవమానించేలా ఇప్పుడు మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్డీఏ అధికారంలో ఉన్న బిహార్‌లో కుల జనగణకు మద్దతు ఇచ్చారని, దేశవ్యాప్తంగా చేయాల్సిన కులగణనకు మాత్రం ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని, బీపీ మండల్ సిఫార్సులను అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుల వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేస్తున్నట్లు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం, కార్యదర్శి డి.తిరుపతిరావు తదితరులు పేర్కొన్నారు.

ఫాదర్ హెయ్యర్ ఆశయసాధనకు కృషి చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 31: ఆంధ్ర ఇవాంజలిక్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ) ఏర్పాటుతో పాటు విద్యా, సామాజిక సేవారంగాల్లో ఫాదర్ హెయ్యర్ చేసిన కృషి ఎనలేనిదని, ఆయన ఆశయసాధనకు సంఘం పని చేయాలని ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ ఇసుకపాటి శ్యాంకుమార్ అన్నారు. ఏఈఎల్‌సీ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం స్థానిక ఆంజనేయపేటలోని జోనథన్ రెసిడెన్సీలో ఘనంగా నిర్వహించారు. దాదాపు 400 మంది పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు వేదాల డైజీబాబు, గుమ్మడి రత్నబాబు, జీ వీర్రాజు, సతీష్, శ్యామల, కే జయసుధ పెద్ద సంఖ్య లో విశ్వాసులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎస్‌కేబీపీఎం విద్యార్థిని

గుంటూరు(విద్య), జూలై 31: స్థానిక వేణుగోపాల్‌నగర్‌లోని ఎస్‌కేబీపీఎం స్కూల్ విద్యార్థిని ఎన్‌సీసీ కోటలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం శివకుమారి, పాఠశాల ఎన్ సీసీ ఆఫీసర్, వ్యాయామ ఉపాధ్యాయిని గుమ్మడి సునీల మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పాఠశాలకు చెందిన బత్తుల శైలజ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా ఎన్‌సీసీ కోటాలో ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని శైలజను హెచ్‌ఎం. ఉపాధ్యాయులు అభినందించారు.

లాడ్జిలో వ్యక్తి మృతి

గుంటూరు, జూలై 31 : కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటగ్రౌండ్ ఎదురుగా ఉన్న నటరాజ్ లాడ్జిలో సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన చీరాలకు చెందిన డేగల సుబ్బారావు అనే వ్యక్తి మృతి చెందాడు. లాడ్జి సిబ్బంది ఇచ్చిన సమాచారంతో కొత్తపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. గుండెపోటు కారణంగా మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

చెత్త తరలించే విద్యుత్ ఆటోలను పాడుబెడతారా?

● అధికారుల తీరుపై ఎమ్మెల్యే గల్లా మాధవి ఆగ్రహం



షెడ్డులోని విద్యుత్ వాహనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చెత్త తరలించే విద్యుత్ ఆటోలను పాడుబెట్టడంపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. 21వ డివిజన్ పర్యటన సందర్భంగా నగరపాలక సంస్థ వెహికల్ షెడ్డును బుధవారం ఆమె పరిశీలించారు. విద్యుత్ ఆటోలు 100కు పైగా వైసీపీ రంగులతో నిర్వహణ లేక నాశనమై ఉండటాన్ని ఆమె గమనించారు. రిపేరుకు వచ్చినవి వచ్చినట్టుగా షెడ్డు పాలు చేశారని ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని అధికారులను అడిగితే, కావాల్సినన్ని యంత్రాలు అందుబాటులో లేవని తప్పించుకుంటున్నారని, మరి ఉన్న యంత్రాలను సక్రమంగా వినియోగించుకోకుండా, వాటిని పాడు బెట్టడం సమంజసమేనా అని అధికారులను నిలదీశారు. విద్యుత్ వాహనాలు వాడకుండా వదిలేస్తే బ్యాటరీలు కూడా పాడైపోయే ప్రమాదం ఉందని, రంగులు సంగతి ఎలా ఉన్నా సరే, పట్టించుకోకుండా వెంటనే వాటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మాధవి ఆదేశించారు.

అధికారుల తీరు మారదా..?

పారిశుధ్య సమస్యపై క్షేత్రస్థాయిలో పర్యటించి, పదేపదే అధికారులతో సమీక్షలు జరిపినా వారిలో చలనం రాకపోవటం దురదృష్టకరమని ఎమ్మెల్యే మాధవి మండిపడ్డారు. 21వ డివిజన్లో రెండో రోజు దివ్యాంగుల కాలనీలో ఆమె పర్యటించారు. తమ ప్రాంతం మొత్తం గంజాయికి అడ్డాగా మారిపోయిందని, ఖాళీ స్థలాల్లో గంజాయి తాగి, ప్రజల మీద దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని ఆమె గుర్తించారు. కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ చెత్తచెదారం, పిచ్చి మొక్కలతో నిండి, మురుగునీరు నిలిచి ఉండటంతో, మీ పిల్లల్ని ఇలా ఉన్న స్కూలుకు పంపుతారా? అంటూ అధికారులను నిలదీశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని గల్లా మాధవి పిలుపునిచ్చారు. గుంటూరులో ఒక పాఠశాల ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు నుంచి లాడ్జి సెంటర్ వరకూ నిర్వహించిన వన మహోత్సవ ర్యాలీకి హాజరై, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

పాఠశాలలో అసంపూర్తి నిర్మాణాలపై ఎమ్మెల్యే నసీర్ ఆరా



పాఠశాలలో అసంపూర్తి నిర్మాణాలపై హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు సిటీ, జూలై 31: గుంటూరు నగరంలోని వెంగళరావునగర్ నగరపాలక సంస్థ బాలిక ఉన్నత పాఠశాలను తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ బుధవారం తనిఖీ చేశారు. వార్డు విజిట్‌లో భాగంగా పాఠశాలకు వచ్చిన ఆయన అసంపూర్ణంగా ఉన్న నిర్మాణాలపై ఆరాతీశారు. తరగతి గదుల నిర్మాణానికి ఎన్ని నిధులు వచ్చాయని పాఠశాల హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు కాగా, రూ.60 లక్షలు ఖర్చు చేసినట్లుగా హెచ్‌ఎం ఎమ్మెల్యేకి వివరించారు. ఉన్న నిధులను వెచ్చించి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా నిధులు అవసరం అయితే విద్యాశాఖ మంత్రితో మాట్లాడి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 53వ డివిజన్ ప్రెసిడెంట్ గుడిమెట్ల దయారత్నం తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి దేవస్థానాన్ని దర్శించుకున్న నసీర్

గుంటూరు, జూలై 31: ఏటుకూరు రోడ్డులోనున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకంబరీదేవి అలంకరంలో దర్శనమివ్వటంతో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే అమ్మవారి దసరా వేడుకలను అంగరంగ వైభవంగా జరిపించాలని, ఉత్సవాలకు గుంటూరు నగర ఆర్యవైశ్యులు అందరూ సహకరించాలని కోరారు. అలానే పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, నాయకులు కొనకళ్ళ సత్యం, కొత్తూరు వెంకట్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తల్లం శేఖర్, పెండ్యాల విజయ్, అర్బన్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ రవీంద్ర కుమార్ , కోట శేషగిరిరావు తదితరులున్నారు. అనంతరం నసీర్‌ను సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం

గుంటూరు (మెడికల్) జూలై 31: తల్లి పాలు శిశువుకు సంపూర్ణ ఆహారమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి వెల్లడించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆస్టర్ రమేష్ హాస్పి టల్స్ సౌజన్యంతో తల్లిపాల ప్రోత్సాహక వారోత్సవా లపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జిల్లాలో జరిగే తల్లిపాల ప్రోత్సాహక వారోత్సవాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని డాక్టర్ విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్‌కు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్ అనిత, పిడియాట్రిషియన్ డాక్టర్ సాహితి, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి వస్తా

● వరల్డ్ హెరిటేజ్ సెంటర్ డైరెక్టర్ లాజరే ఎలౌండొ అస్సోమో



శ్రీవారి శేష వస్త్రంతో వరల్డ్ హెరిటేజ్ సెంటర్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ జాస్తి వీరంజనేయులు

గుంటూరు సిటీ, జూలై 31 : భారతదేశంలోని అమరావతికి కచ్చితంగా వస్తానని వరల్డ్ హెరిటేజ్ సెంటర్ డైరెక్టర్ యునెస్కో లాజరే ఎలౌండొ అస్సోమో హామీ ఇచ్చినట్లు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని భారత మండపంలో జరి గిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సమావేశంలో పాల్గొన్న ఆయన ఫోన్‌లో అక్కడి విశేషాలను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని ఆయనకు వివరించారు. తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌కు వస్తానని అమరావతిని కూడా సందర్శిస్తానని లాజరే హామీ ఇచ్చినట్టు వివరించారు. ఈ సందర్భంగా శ్రీవారి శేష వస్త్రంతో వరల్డ్ హెరిటేజ్ సెంటర్ డైరెక్టర్‌ను డాక్టర్ జాస్తి వీరాం జనేయులు సన్మానించారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయాలి

● యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి

గుంటూరు(తూర్పు), జూలై 31: ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 3 రోజు ల పాటు వైజాగ్‌లో జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశా లను జయప్రదం చేయాలని ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కొత్తపేటలో సీపీఐ కార్యాలయంలో సమావేశాలు పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశాల్లో భాగంగా వేలాది మంది కార్మికుల మహాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గుంటూరు, జూలై 31: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ అధ్యక్షుడు పి.ఆదిశేషు ఆధ్వర్యంలో మల్లికార్జునపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు డాక్టర్ నెలకుదిటి చందన సమక్షంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. రోటరీ మాతాశిశు సంరక్షణా మాసం సందర్భంగా ప్రతి ఏటా గర్భిణులకు, చిన్నారులకు, ఆరోగ్య సంరక్షణ కోసం పౌష్టికాహారం పంపి ణీ చేశారని క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషు చెప్పారు. కార్యక్రమంలో సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రేమ్‌కుమార్, పూర్వ అధ్యక్షుడు ఎం.వెంకటరమణ, ఎన్.కృష్ణ మోహన్, బి.చెన్నయ్య, వై.శ్రీనివాసరావు, పి.సుబ్బారావు, వైద్యులు శిరీష, ఎం.రామకోటిరెడ్డి, ఐ.నాగిరెడ్డి, ఎస్‌వీ సత్యనారాయణ, వీ.హరిబాబు, చెన్ను శ్రీనివాసరావు తదితరులున్నారు.

హోరా హోరీగా బాస్కెట్ బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 31: గుంటూరు రూరల్, నల్లపాడు, లొయోలా పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రీజియన్ ఐసీఎస్ ఈ పాఠశాలల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. పోటీల్లో భాగంగా అండర్-14, 17 విభాగాల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు, అండర్-19 జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా లొయోలా పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సురేషు, నరేషులు మాట్లాడుతూ గురువారం మిగిలిన మ్యాచ్‌లను పూర్తి చేసి ఫైనల్స్ పోటీలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీలను పాఠశాల కరస్పాండెంట్ ఆంథోని పర్యవేక్షిస్తున్నారు.



పోటీ పడుతున్న జట్లు

వైద్య విద్యార్థులకు జింకానా అవార్డులు

గుంటూరు (మెడికల్) జూలై 31 : ప్రతిభ గల వైద్య విద్యార్థులను ప్రోత్స హించేందుకు జింకానా ఎల్లప్పుడు ముందు ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు, ఎన్నారై డాక్టర్ రవికుమార్ త్రిపురనేని తెలిపారు. బుధవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో చదువులో చక్కటి ప్రతిభ చూపుతున్న వైద్య విద్యార్థులకు ఆయన అవార్డులను ప్రదానం చేశారు. ఏటా గుంటూరు వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) ఆధ్వర్యంలో ఈ అవార్డులను మెడికోలకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ రవికుమార్‌తో పాటు జీఎంసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి, జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ పీవీ హనుమంతరావు, డాక్టర్ వీ బాలభాస్కరరావు తదితరులు అవార్డులను వైద్య విద్యార్థులకు అందజేశారు. ఇంటర్నల్ మెడిసిన్‌లో అత్యధిక మార్కులు సాధించిన షేక్ మహమ్మద్ రఫీ, జనరల్ సర్జరీ ఫైనలియర్ ఎగ్జామ్‌లో అత్యధిక మార్కులు సాధించిన మెడికోగా 2018వ బ్యాచ్ విద్యార్థిని యర్రా సాహితి గైనకాలజీలో ఫైనలియర్‌లో అత్యధిక మార్కులు సాధించిన సాయిగీతిక లింగా, పెథాలజీలో అత్యధిక మార్కులు సాధించిన దీపిక జీ శర్మ, శంకుల భావన, నీట్‌లో అత్యధిక మార్కులు సాధించి జీఎంసీలో ప్రవేశం పొందిన దారపునేని రితిక, ఫస్ట్ ఎంబీ బీఎస్‌లో అత్యధిక మార్కులు సాధించిన తమ్మిశెట్టి సాగి శేఖర్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీలో అత్యధిక మార్కులు పొందిన టీ సాగిశేఖర్, షేక్ నిహత్ సుల్తానా, టీ సాగిశేఖర్‌లకు ఎండోమెంట్ అవార్డులను, నగదు బహుమతిని అందజేశారు. డాక్టర్ తుమ్మల రామబ్రహ్మం రీసెర్చ్ అవార్డును పెథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కట్టా రమ్యకు అందజేశారు.



మెడికోలతో ఎన్నారై రవికుమార్, ప్రిన్సిపాల్ టీటీకే రెడ్డి

పోలీస్ అధికారుల సేవలు మరువలేం

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూలై 31 : జిల్లా పోలీసు విభాగంలో పని చేస్తూ పదవి విరమణ చేసిన 8 మంది అధికారులను బుధవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, పదవి విరమణ పొందడం అభినందనీయం అన్నారు. కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఎటువంటి అవసరమైనా తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చన్నారు. జిల్లా పోలీస్ ఆఫీసు కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ సతీష్ కుమార్, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు పదవీ విరమణ చేసిన అధికారులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను, విలువైన బహుమానాలను అందజేశారు. పదవీ విరమణ చేసిన అధికారులు మాట్లాడుతూ తమకు జరిగిన సన్మానం జీవితంలో ఎన్నటికీ మరువలేమని ఎస్పీ సతీష్ కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పాటు ఆర్‌ఐ శ్రీహరిరెడ్డి, గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్, షైలా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. పదవి విరమణ చేసిన వారిలో రత్నస్వామి స్పెషల్ బ్రాంచ్, డీఎస్పీ, వెంకటేశ్వర్లు, ఎఎస్సై, గుంటూరు స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్, పెదబాబు, ఎఎస్సై , గుంటూరు పోలీస్ కంట్రోల్ రూమ్, ఎస్‌కె ఎండి జానీ, ఎఎస్సై, మేడికొండూరు పోలీస్ స్టేషన్, మోహన్‌రావు, ఎఎస్సై, ఫిరంగిపురం పోలీస్ స్టేషన్,దేవరాజు, హెడ్ కానిస్టేబుల్, అరండల్‌పేట పోలీస్‌స్టేషన్, జి.రత్నరాజు, గుంటూరు ఏఆర్, కమాల్‌భాష, తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తదితరులు ఉన్నారు.

పేదలందరికీ ఇళ్లు.. చంద్రన్న ప్రభుత్వం శ్రీకారం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ ఫర్ ఆల్ అనే నినాదంతో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి చంద్రన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కొనియాడారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడానికి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే కీలకమైన ఐదు హామీలు అమలుకు ఐదు ఫైళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేశారన్నారు. వేలాది మంది నిరుద్యోగులు, రైతులు, 65 లక్షల మంది పింఛనుదారులు, యువత, పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. పేదవాడి ఆశల మేరకే చంద్రబాబు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని వారికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు అందజేయనున్నట్లు తెలిపారు. పక్కా ఇళ్లు నిర్మించడానికి రూ.4లక్షలు అందిస్తామన్నారు. అన్న క్యాంటీన్లు ఆగస్టు నుంచి తిరిగి ప్రారంభిస్తామన్నారు. జర్నలిస్టులకు కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఇళ్లు కట్టించడానికి పూనుకోవడం హర్షణీయమన్నారు. వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాల పేరుమీద భూదందా, మెరక తోలడం పేరుతో దోపిడీ చేసి పేదల పొట్టకొట్టారన్నారు. వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజమాష్టారు మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల గతంలో నెర వేర్చింది, ఇప్పుడు నెరవేర్చేది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వమేనని చెప్పారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, బొబ్బిలి రామారావు, షేక్ చిన్న బాజీ తదితరులు పాల్గొన్నారు.

కాకా హోటళ్లుగా వైసీపీ కార్యాలయాలు : కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యాలయాలన్నీ కాకా హోటళ్లుగా మారిపోయాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్పంలో చంద్రబాబుని పెద్ద మెజారిటీతో ఓడిస్తామని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి, ఆయన పెంపుడు కుక్కలు నేడెందుకు మొరగటంలేదని ప్రశ్నించారు. కుప్పంలో జరిగినట్లే త్వరలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోని వైసీపీ కార్యాలయాలు మూతపడటం ఖాయమని అన్నారు. అధికార మదంతో అంబోతు రాంబాబు, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డిలాంటి వారు ఎన్టీఆర్ భవన్లను కరోనా ఆస్పత్రులుగా మార్చుకోమని రెచ్చిపోయి మాట్లాడిన వారికి దేవుడు చక్కటి స్క్రిప్టును రాశాడని అన్నారు. వారి పాపాలపుట్ట పగిలి జైలుకెళ్లటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. చంద్రబాబు కూడా జగన్ రెడ్డిలా కక్ష తీర్చుకోవాలంటే వైసీపీ నాయకులను ఉంచేందుకు జైళ్లు, ఆస్పత్రులు సరిపోవని అన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు ఇంకా అనేక పథకాలు అమలు చేసి చూపిస్తామని చెప్పారు. జగన్ ముఠా దోపిడీని ప్రజలకు తెలియజేసేందుకే శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే సంక్రాంతి పండుగ నాటికి అంబటి రాంబాబు సంబరాల రాంబాబుగామారి హరిదాసు వేషంలో సత్తెనపల్లి ప్రజలను రంజింప చేయనున్నాడని కనపర్తి ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్‌పై అవాకులు పేలితే మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు.

రేషన్ పంపిణీ డీలర్ల ద్వారానే చేయాలి

● చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు



జేసీ భార్గవతేజని కలిసిన చౌకధరల దుకాణదారులు సంక్షేమ సంఘం నాయకులు

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేని ఎండీయూ వ్యవస్థని నిలిపివేసి రేషన్ సరుకులను డీలర్ల ద్వారానే ప్రజలకు పంపిణీ చేసేలా చూడాలని చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజకి విజ్ఞప్తి చేశారు. బుధవారం సంఘం అధ్యక్షుడు వైఏబీ ప్రసాదరావు నేతృత్వంలో డీలర్లు జేసీని కలిసి పలు సమస్యలను నివేదించారు. ఐసీడీఎస్, ఎండీఎం తాలూక కొన్ని సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కమీషన్‌ని త్వరగా డీలర్లకు విడుదల చేయించాలన్నారు. రెండు నెలల నుంచి బియ్యంపై వచ్చే కమిషన్‌ని ఎస్‌సీఎం ఖాతాలో వేయడం వల్ల డీలర్లు ఆర్థికపరంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎస్‌సీఎంలో ఉన్న కమీషన్‌ని డీలర్ల వ్యక్తిగత ఖాతాలోకి మార్చాలన్నారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారు దాసరి శ్రీనివాసరావు, నగర నాయకులు వంగపాటి అంజయ్య, కే విద్యాసాగర్, పీ సాయి, హన్మంతరావు, కిషోర్, రాంప్రసాద్, రషీద్, రంగారావు, సుబ్బారావు, మీరావలి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు ద్రోణాచార్య అవార్డు



అవార్డు అందుకుంటున్న శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు (మెడికల్), జూలై 31: బెంగళూరులో ఇటీవల జరిగిన స్త్రీ, ప్రసూతి వైద్యనిపుణుల సంఘం దక్షిణాది రాష్ట్రాల సదస్సు క్విజ్ పోటీల్లో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఏపీ జట్టులో ఉమాశంకర్‌తో పాటు డాక్టర్ సుమావర్ష, డాక్టర్ దేదీప్య సభ్యులుగా ఉన్నారు. క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ కైవశం చేసుకున్నారు. ఈ సదస్సులో ప్రతిష్ఠాత్మకమైన ద్రోణాచార్య అవార్డును డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది గైనకాలజిస్టుల దక్షిణాది రాష్ట్రాల వైద్య సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వను న్నట్లు ప్రకటించారు. ఏపీలో తొలిసారిగా నిర్వహించే సౌత్ స్టేట్ కాన్ఫరెన్స్ నిర్వహణ బాధ్యతలను డాక్టర్ ఉమాశంకర్‌తో పాటు డాక్టర్ పద్మజ, డాక్టర్ ప్రమోద, డాక్టర్ పద్మలత తదితరులు చేపడుతారు. వచ్చే ఏడాది ఏపీలో ప్రతిష్టాత్మక దక్షిణాది రాష్ట్రాల గైనకాలజీ వైద్యసదస్సులో స్త్రీ, ప్రసూతి వైద్యరంగంలో అంతర్జాతీయ స్థాయిలో పేరు, ప్రఖ్యాతులు సాధించిన వైద్యనిపుణులతో పాటు, దిగ్గజ ఫార్మా కంపెనీల సైంటిస్టులు పాల్గొంటారు. ఈ సదస్సులో ప్రత్యేకంగా పీజీ విద్యార్థులకు, కొత్తగా సంతాన సాఫల్యత చికిత్సలు చేస్తున్న ఐవీఎఫ్ వైద్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని డాక్టర్ ఉమాశంకర్ వెల్లడించారు.

అక్టోబరు 25 నుంచి నాటక పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 31: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మంది రంలో అక్టోబరు 25, 26, 27 ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సాంఘిక నాటిక పోటీల ను నిర్వహిస్తున్నట్లు అల్లురామలింగయ్య నాటకకళా పరిషత్, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెండెం వెంకటశివప్రసాద్ అన్నారు. బుధవారం అల్లురామలింగయ్య వర్థంతిని పురస్కరించుకొని స్థానిక బ్రాడీపేటలోని షిరిడీసాయి దీన జనాసేవా సమితి అంధుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలకు సంబంధించిన వివరాలకు 8074148228 నెంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు రేజేటి రామకృష్ణ, దళవాయి సుబ్రహ్మణ్యం, తట్టల శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం మెరుగైన శిక్షణ

గుంటూరు(విద్య), జూలై 31: యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం మెరుగైన శిక్షణ అందిస్తామని అవిఘ్న విద్యాసంస్థ డైరెక్టర్ కలారి సాయికృష్ణ పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేట 7వలైనులో విద్యాసంస్థ ప్రారం భం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దూర విద్య పది, ఇంటర్, డిగ్రీ కోర్సులతోపాటు, బీటెక్ విద్యార్థులకు, బీఏ, ఎంఏ కోర్సులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. వీఎస్‌ఆర్ స్కూల్ డైరెక్టర్ వంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరికి విద్య అనే నినాదంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దయానందబాబు, గౌరవ సలహాదారు ఎం సువర్ణరాజు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 1 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



నా దగ్గర ఆధారాలు ఉన్నాయి..
లీగల్‌గానే వెళతా

హీరో రాజ్‌తరుణ్, లావణ్యల వివాదం బుధవారం కొత్త మలుపు తిరిగింది. రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం జరిగితే అక్కడికి లావణ్య వచ్చారు. ఆ చిత్ర కథనాయిక, ఈ వివాదానికి కేంద్ర బిందువు అయిన మాల్వీ మల్హోత్రా కూడా వచ్చారు. రాజ్‌తరుణ్, మాల్వీ ఇద్దరూ వైట్ డ్రస్‌లో ఉండడం గమనార్హం. రాజ్‌తరుణ్ వస్తున్నాడని తెలియగానే మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'నా సినిమా హిట్ అయినప్పుడు కూడా ఇంత మంది మీడియా సభ్యులు రాలేదు' అంటూ రాజ్‌తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనపై వచ్చిన వివాదం గురించి ఆ మీడియా సమావేశంలో రాజ్‌తరుణ్ చెప్పిన మాటలు ఇవి.


- నాలో ఉన్న అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అందుకే లీగల్‌గా వెళుతున్నాను.
- నా వల్ల గర్భం వచ్చిందనీ, అబార్షన్ చేయించానని ఆరోపిస్తున్నారు. మరి ఆ విషయాన్ని పోలీసులకు ఇచ్చిన కంప్లయింట్‌లో ఎందుకు చేర్చలేదు? ఎందుకంటే అవి నిజాలు కావు కనుక. అందుకే ఈ విషయం గురించి నేను మాట్లాడను. మా లాయర్ ద్వారా ప్రొసీడ్ అవుతున్నా.
- నాకు ఇప్పుడు 32 ఏళ్లు. ఇన్నేళ్ల జీవితంలో ఎందరో పరిచయం అయి ఉంటారు. ఎంతో మందితో సాన్నిహిత్యం ఉంది. వాళ్లలో ఎవరైనా నేను మంచి వాడిని కాదు అని చెబితే పరిశ్రమ నుంచి తప్పుకొంటా.
- నేనూ మనిషినే. బాధలు ఉండవా! ఆ బాధ వల్లే 'పురుషోత్తముడు' చిత్రం ఫంక్షన్‌కు కూడా రాలేదు. ఆ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
- నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. అది ఇప్పుడు చెబుతున్న మాట కాదు. నా పాత ఇంటర్వ్యూలు చూస్తే అది మీకు తెలుస్తుంది.
- 'తిరగబడరా సామి' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఫ్యామిలీ అంతా చూడదగ్గ సినిమా ఇదనీ, మాల్వీ మల్హోత్రా మంచి నటి అనీ, ఆమెకు ఇదే తొలి సినిమా కనుక ఆదరించండి.

లావణ్య ప్రత్యక్షం



తనకు కనిపించకుండా తిరుగుతున్న రాజ్‌తరుణ్ ప్రసాద్ ల్యాబ్‌లో ఉన్నారని తెలియగానే లావణ్య అక్కడ ప్రత్యక్షమయ్యారు. రాజ్‌తరుణ్ కలుసుకోవాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతమంది మీడియా ప్రతినిధులు ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు లావణ్యను అక్కడ నుంచి పంపించేశారు. ఆ తర్వాత ఆమె మాదాపూర్‌లోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకొని అక్కడ కూడా అందోళనకు దిగారు. తలుపు తీసే వరకూ అక్కడ నుంచి వెళ్లనని అన్నారు. రాజ్‌తరుణ్ అడిగిన ఆధారాలు తెచ్చినట్లు చెప్పారు.

కట్టి పడేసే కియారా



రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అడ్వాణి కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా లుక్ పోస్టర్ విడుదల చేశారు. చూపు తిప్పుకోవడం కష్టం అనేంతగా ఉన్న కియారా గ్లామర్ లుక్ అభిమానుల్ని కట్టి పడేస్తోంది.

'గద్దర్ అవార్డ్స్'పై కమిటీ ఏర్పాటు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిల్మ్ అవార్డ్స్ ను ఇకపై 'గద్దర్ అవార్డ్స్' పేరుతో ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై తెలుగు చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'నటుడిగా, గాయకుడిగా ఎంతో ప్రతిభ కలిగిన వ్యక్తి గద్దర్. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలనుకోవడం సముచిత నిర్ణయం. ఈ అవార్డుల విధివిధానాలు ఎలా ఉండాలో తయారు చేయడానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి ఓ కమిటీని నియమిస్తాయి. ఆ విధి విధానాలను ఎఫ్.డి.సి. ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి త్వరలో అందజేస్తాం' అని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్యామిలీ డ్రామా




కృష్ణవంశీ, మోక్ష జంటగా నటించిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమవతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఈ సినిమా నచ్చడంతో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇదనీ, కథ అనుకున్నప్పుడే కొత్త వాళ్లతో తీయాలని అనుకున్నామనీ దర్శకుడు చెప్పారు. ఈ జనరేషన్‌కు కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమను చిత్రంలో చూపించామనీ, కొత్త టాలెంట్‌తో సినిమా తీశామని నిర్మాతలు చెప్పారు.

బడ్డీనే హీరో



అల్లు శిరీష్ హీరోగా నటించిన 'బడ్డీ' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. జ్ఞానవేల్ రాజా, అధన నిర్మాతలు. శామ్ ఆంటోన్ దర్శకుడు. బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సెకండ్ హీరో. టెడ్డీ బేర్ ఫస్ట్ హీరో. టెడ్డీ చేసే యాక్షన్ సీన్లు అలరిస్తాయి' అని చెప్పారు. ఈ సినిమా విషయంలో నిర్మాత హ్యాపీగా ఉన్నారనీ, టీమ్ కూడా సంతోషంగా ఉందని దర్శకుడు చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో



నా గత చిత్రాలకు మల్లే 'శివం భజే' సినిమాలోనూ ఓ కొత్త థ్రిల్లింగ్ అంశాన్ని చూపించబోతున్నాం అని హీరో అశ్విన్ బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా అశ్విన్‌బాబు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కుటుంబ అనుబంధాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను స్పృశించాం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని బలంగా నమ్మే పాత్ర నాది. ఇందులో యాక్షన్ స్టైలిష్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

కీర్తి కామెడీ



కీర్తిసురేశ్ లీడ్‌రోల్ పోషిస్తున్న మహిళా ప్రాధాన్య చిత్రం 'రఘుతాత'. సుమన్ కుమార్ దర్శకుడు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. గడుసైన యువతి పాత్రలో కీర్తి కామెడీ పండించిన తీరు ఆకట్టుకుంది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

తుపాన్ లాంటి యాక్షన్



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బిచ్చగాడు' తర్వాత నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం యూనిట్ చాలా కష్టపడింది. విజయ్ ఆంటోని ఇందులో సరికొత్తగా కనిపిస్తారు. వినోదం,యాక్షన్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.



డెంగీ వ్యతిరేక మాసోత్సవ ముగింపు ర్యాలీని నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం తదితరులు

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలి, మారీసుపేట జూలై 30: పట్టణ ప్రజలు దోమలతో అప్రమత్తంగా ఉంటే డెంగీ వ్యాధిబారిన పడకుండా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. స్థానిక చినరావూరుతోటలో బుధవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవ ముగింపు కార్యక్రమాన్ని మలేరియా, ఫైలేరియా అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం, పట్టణ స్పెషల్ ఆఫీసర్ అంగలకుదురు గాయత్రీదేవిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులని, నీటి నిల్వలు దోమలకు ఆవాసాలని అన్నారు. దోమ కాటువలన డెంగీ, మలేరియా వ్యాధులకు గురవుతారని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒకసారి నీటి నిల్వలను మార్చాలన్నారు. అనంతరం చినరావూరులో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ముగింపు ర్యాలీని నిర్వహించి, మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మలేరియా, ఫైలేరాయా అధికారులు, సిబ్బంది, పాల్‌రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థులు వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

నేర్చుకోవాలనే తపనతోనే ముందుకుసాగాలి

● విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య), జూలై 31: యువత తమ జీవితాల్లో అన్ని భావోద్వేగాలను సమంగా చూడాలని, నిత్యం నేర్చుకోవాలన్న తపనతోనే ఉన్నతస్థాయికి చేరతారని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. బుధవారం వడ్లమూడిలోని విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమైన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే సంతోషం, బాధ, కష్టాలు, నష్టాలు, ఒడిదుడుకులు ఉంటేనే సంపూర్ణ జీవితం అవుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు ప్రణాళికబద్ధంగా వారిని తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల్ని డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్రకుమార్ తదితరులు అభినందించారు. మొత్తం 603మందికి 840 ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్, వివిధ విభాగాల డీన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కేంబ్రిడ్జి యూనివర్శిటీలో ప్రతిష్టాత్మకమైన పెట్, కెట్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలి

● ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్

తెనాలి రూరల్, జూలై 31: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పత్రికా విలేకరులపై, యాజమాన్యాలపై పెట్టిన అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి పట్టణంలోని గౌతమ్‌గ్రాండ్ హోటల్‌లో ఏపీయూడబ్ల్యూజే తెనాలి నియోజకవర్గ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారమహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించి వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. నియోజవర్గ అధ్యక్షుడిగా చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా మేలేటి గోపిచంద్, ఉపాధ్యక్షుడిగా శ్యామల ప్రసాద్‌రెడ్డి, తాడిగిరి శరత్‌బాబు, గౌరవాధ్యక్షుడిగా బొల్లిముంత కృష్ణ, కోశాధికారి దీపాల సాయినాథ్, కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దుల సాయినాథ్, సహాయ కార్యదర్శులుగా తన్నీరు కల్యాణ్‌కుమార్, కంకిపాటి రమేష్‌కుమార్, బత్తుల కమలాకర్, కార్యవర్గసభ్యులుగా ఎం. వెంకటేశ్వరరావు, ఆర్‌వి.కిరణ్‌కుమార్, షేక్ అబ్దుల్ హకీం జాని, గళ్ల కృష్ణలు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా చందు జనార్ధన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పత్రిక, మీడియా రంగాలపై ఎన్నడూ లేని విధంగా అణగదొక్కేందుకు చేయని ప్రయత్నం లేదన్నారు. ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు అందించి ప్రభుత్వపరంగా జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. పెద్దసంఖ్యలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, పట్టణ ప్రముఖులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుడు సాంబిరెడ్డిని, అతని తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, జూలై 31: పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి అని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు ఈదా సాంబిరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పి.వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ సాంబిరెడ్డి ఎంతో మంది విద్యార్థులకు బంగారు బాటవేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్‌ఆర్ కళాశాల కోశాధికారి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు మాజీ కార్యదర్శి లలితప్రసాద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలసుందరం, అప్పారావు, భారతి, రత్నరాణి, రాజీవ్‌రతన్, చంద్రశేఖర్, నాయకులు జె.శివారెడ్డి, కె.రవిశేఖర్‌రెడ్డి, అన్నవరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాని తాగునీటికి పన్నులు కట్టాలా...

● నీటి సరఫరా లేకుండా పన్నులపై స్వపక్ష, విపక్ష సభ్యుల నిలదీత

● కమిటీని నియమించి సమస్యలను పరిష్కరిస్తాం: కమిషనర్



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, తాగునీటి కనెక్షన్లపై అధికార, విపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం

తెనాలి, మారీసుపేట జూలై 31: పట్టణంలోని అన్ని వార్డులలో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, రాని తాగునీటికి పన్నులు కట్టాలా అంటూ స్వపక్ష, విపక్ష సభ్యులు కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించారు. తెనాలి కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగింది. ఉదయం 11గంటలకు సాధారణ సమావేశం మొదలయితే, అజెండాలోని 36అంశాల చర్చించడానికి కౌన్సిల్ ముందుంచారు. పదమూడో అంశం చర్చకు రాగా 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ 40 వార్డులలో ఎన్ని తాగునీటి కనెక్షన్‌లు ఉన్నాయి, అన్ని వార్డులలో తాగునీరు సరఫరా చేస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. చైర్‌పర్సన్ రాధిక కమిషనర్ శేషన్నను సమాధాన మివ్వాలని కోరారు. ఆయన వివరణ ఇస్తూ 2019నాటికి సుమారు 11600 కనెక్షన్‌లు ఇచ్చామని, తరువాత 500 కనెక్షన్ ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంలో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో 11,600 కనెక్షన్‌లు ఇవ్వగా, ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం పాలనలో కేవలం 500కనెక్షన్‌లు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. డిమాండ్ నోటీసులు ఇస్తున్నారని, ఖాళీ స్థలాలలో కూడా కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారని ముందు తాగునీటి పన్నుల సమస్యను పరిష్కరించాలని కోరారు. చైర్‌పర్సన్ రాధిక సమాధానమిస్తూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలకు సేవచేయడానికే అన్నారు. ఈ సమయంలో ఇరుపక్ష సభ్యులు వాదనకు దిగడంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో కమిషనర్ బి.శేషన్న కలుగజేసుకొని సమాధానమిస్తూ ఇంటి పన్ను డిమాండ్ నోటీసులో నీటిపన్నును కలిపి ఇచ్చిన మాట వాస్తవమేనని, ఇదే విషయంపై ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులతో కలసి ఒక కమిటీని ఏర్పాటు చేశ్తామని తెలిపామన్నారు. కమిటీ ఏర్పాటు చేయడం జాప్యం జరిగిందని త్వరలోనే సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మొదటి అంశం చదువుతుండగా కౌన్సిలర్ ఆవుల కోటయ్య మాట్లాడుతూ తమ వార్డులో వీధి దీపాల రిపేరు చేసేటప్పుడు సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు. మున్సిపల్ ఏఈ సమాధానమిస్తూ తొమ్మిదిమంది ఎలక్ట్రీషియన్లు ఉన్నారని వారు రోజు అన్ని వార్డులలో పర్యవేక్షణ చేస్తారని, అవసరమైన వాటిని మారుస్తారని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను తెలియజేస్తే వాటిని కూడా పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు. తదుపరి 4వ అంశం చదువుతుండగా వైసీపీ కౌన్సిలర్ రత్నకుమారి మాట్లాడుతూ గురవయ్య కాలనీ రోడ్డులో వ్యర్థాలను పోస్తున్నారని అక్కడ 60 కుటుంబాల వారు నివసిస్తున్నారని వారు అనారోగ్యం బారినపడుతున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక సమాధానం చెప్పమని అధికారులను కోరగా మున్సిపల్ శానిటేషన్ అధికారులు వ్యర్థాలను బయటివారు పోస్తున్నారని, త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. అనంతరం ఎజెండాలోని అన్ని అంశాలను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. ముందుగా టీడీపీ కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో నూతన భవనాలకు ఎన్ని అంతస్తులు నిర్మించుకోవచ్చో తెలపాలని అధికారులను కోరారు. తమ పరిధిలో జీ+3 వరకు నిర్మించుకోవచ్చన్నారు. కానీ తన ఆరవ వార్డులో ఐదు అంతస్తులకు శ్లాబ్‌లు వేయగా అధికారులు కూల్చారని, వారు మరలా ఐదు అంతస్తులు పూర్తిచేశారని, మీరు అనుమతి ఇచ్చారా అని ప్రశ్నించారు. సిటీప్లానింగ్ అధికారి సుధాకర్ సమాధానమిస్తూ నిబంధలకు విరుద్ధంగా నిర్మించిన అంతస్తును కూల్చామని, నిర్మించుకోవడానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. పురపాలక సంఘ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జీరో అవర్‌లో పలు అంశాలను సభ్యులు ప్రస్తావించారు. ముఖ్యంగా 27 వార్డులో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ బోయపాటి అరుణ కోరారు. సమావేశంలో అధికార, విపక్ష కౌన్సిల్ సభ్యులు, పలు శాఖల మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఏమైనా గొడవలు జరుగుతాయోనని ముందస్తు జాగ్రత్తలలో భాగంగా పోలీసు అధికారులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

టిడ్కో గృహాలను త్వరగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



గృహ నిర్మాణంపై సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జూలై 31: టిడ్కో గృహ నిర్మాణాలను తక్షణమే పూర్తిచేసి లబ్ధిదారులకు అందచేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశించారు. పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం టిడ్కో గృహ సముదాయాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గృహాల లబ్ధిదారుల వివరాలను, గృహ నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిపై వివరాలు అందచేశారు. రుణాలు మంజూరై రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న 65మంది లబ్ధిదారులకు ఆగస్టు 15వ తేదీన గృహాలు అందచేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మిగిలి ఉన్న 550మంది లబ్ధిదారులకు గృహ రుణాల మంజూరు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. అలాగే తాగునీరు, గృహ సముదాయాలో ఇతర సౌకర్యాలు, మిగిలివున్న 10శాతం పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పురపాలక సంఘం అధికారులు, టిడ్కో సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు సత్కారం

తెనాలి, మారీసుపేట జూలై 31: స్థానిక చెంచుపేటలోని యూనిట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో బుధవారం అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్‌లో పతకాలను సాధించిన అకాడమీ క్రీడాకారులను పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి చంద్రమౌళి సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 20, 21 తేదీలలో జరిగిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ (తైక్వాండో) చాంపియన్ షిప్ పోటీలలో అకాడమీ క్రీడాకారులు 12మంది పాల్గొనగా ఏడు స్వర్ణ పతకాలు, రెండు రజిత, నాలుగు కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. ఆగస్టు నెల 10, 11 తేదీలలో జరిగే సౌత్ఇండియా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు సుంకర సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆషాడ పట్టీ సమర్పిస్తున్న ఆలయ ధర్మకర్త లింగమనేని కుటుంబ సభ్యులు

దశావతార వెంకటేశ్వర స్వామికి ఆషాడ పట్టీ సమర్పణ

పెదకాకాని, జూలై 31: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో ఆషాడమాసం సందర్భంగా బుధవారం స్వామి వారికి ఆషాడ పట్టీ సమర్పించినారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు, స్వర్ణకుమారి దంపతులు పాల్గొన్నారు.

తెనాలి డీఎస్పీగా జనార్ధన్‌రావు



డీఎస్పీ జనార్ధన్‌రావు


తెనాలి రూరల్, జూలై 31: డీఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలి డీఎస్పీగా బి.జనార్ధన్‌రావు రానున్నారు. ఇప్పటివరకూ తెనాలిలో విధులు నిర్వహిస్తున్న ఎం.రమేష్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో రిపోర్ట్ చేయనున్నారు. ఎన్నికల ముందు డీఎస్పీ జనార్ధర్‌రావు తెనాలి నుంచి విజయవాడ ట్రాఫిక్ విభాగానికి బదిలీపై వెళ్లారు.



అజ్మీర్ దర్గాలో సమర్పించే చద్దర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, తదితరులు

అజ్మీర్ మొక్కుకు బయల్దేరిన టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, జూలై 31: తెలుగుదేశం పార్టీ విజయంతో పాటు, పొన్నూరు ఎమ్మెల్యేగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ 6వ సారి గెలుపొందిన సందర్భంగా మొక్కుబడులు తీర్చుకునేందుకు టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు బుధవారం అజ్మీర్ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ నివాసంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అజ్మీర్ దర్గాలో అందచేసే గంధం, చద్దర్లకు ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి నరేంద్ర కుమార్‌కు అందచేశారు. ఎమ్మెల్యే అజ్మీర్ బయల్దేరే భక్తులకు ఈ చద్దర్, గంధం అందచేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

ప్రభుత్వ పాఠశాల్లో మెనూ అమలుచేయాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

చేబ్రోలు, జూలై 31: ప్రభుత్వ పాఠశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందచేయాలని జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ ఆదేశించారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్, చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య హైస్కూల్‌లో బుధవారం జేసీ ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై మెనూ ప్రకారం ఆహారం అందుతుందా అని విద్యార్థులను ప్రశ్నించారు. అలాగే ఆహార నాణ్యత గురించి ఆరా తీశారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలోనే భోజనం స్వీకరించాలని సూచించారు. విద్యార్థులకు అందవలసిన యూనిఫాం, పాఠపుస్తకాల గురించి ఆరా తీశారు. అలాగే ఫోర్టిఫైడ్ రైస్ నిల్వల గురించి తెలుసుకున్నారు పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం చేబ్రోలు తహసీల్దార్ కార్యాలయం, సచివాలయాని సందర్శించి పనితీరు గురించి ఆరాతీశారు. ప్రత్యేక అధికారి ఎ.లక్ష్మీకుమారి, పలు ప్రభుత్వ శాఖల జేసీతో పాటు ఉన్నారు.

నాగేంద్ర స్వామి ఆలయంలో చోరీ

పెదకాకాని, జూలై 31: మండల పరిధిలోని వెంకట కృష్ణాపురం ఉప్పలపాడు గ్రామాల మధ్య ఉన్న నాగేంద్ర స్వామి (పుట్ట) ఆలయంలో గత రాత్రి వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీలు ఎత్తుకొనిపోయినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



రోటరీ క్లబ్ ప్రతినిధుల బెంచీల వితరణ

తెనాలి అర్బన్, జూలై 31: పట్టణంలోని పలు సంస్థలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సిమెంట్ బెంచీలు వితరణగా అందచేశారు. తెనాలి ఐటీఐ, పెదరావూరు, నందివెలుగు, తేలప్రోలు, యడ్లలింగయ్య కాలనీ, నాజరుపేట, గోశాలలో రూ.లక్ష విలువైన 21సిమెంట్ బెంచీలు అందజేశారు. అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటరత్నం, ఈదర పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

వైకంఠపురం ఆలయ హుండీ ఆదాయం రూ.23.33 లక్షలు

తెనాలి అర్బన్, జూలై 31: వైకుంఠపురం ఆలయానికి హుండీ ఆదాయం రూ.23 లక్షల 33 వేల 85 లు లభించింది. మూడు నెలల కాలానికి గాను బుధవారం శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లోని సీతారామ ఆలయంలో జీవీ అమర్‌నాథ్ ప్రత్యేక అధికారిగా నిర్వహించిన లెక్కింపులో చెంచుపేట బ్యాంకు సిబ్బంది, స్కౌట్స్ అండ్ గౌడ్స్ విద్యార్థులు, మహిళా భక్తులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ ఈవో తిమ్మానాయుడు లెక్కింపును పర్యవేక్షించారు.

హాస్యనటుడు వెంకయ్య వర్ధంతి

తెనాలి అర్బన్, జూలై 31: రంగస్థల కళాకారులు, హాస్యనటుడు ఆర్.వెంకయ్య వర్ధంతిని బుధవారం నందులపేటలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ రంగస్థల కళాకారు సంఘం కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, తన్నీరు శివశంకర్, బొల్లిముంత కృష్ణ, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, చెరుకుమల్లి సింగారావు తదితరులు ఆయన అందించిన సేవలను కొనియాడారు.



వెంకయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

మెరుగైన విద్య అందించటమే లక్ష్యం

● ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, జూలై 31: పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించటమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు 8వ వార్డు క్యాబిన్‌పేటలో బుధవారం ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రారంభించారు. గతంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల 1976 నుంచి నిర్వహిస్తుండేవారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ పాఠశాలను మూసివేయటంతో ఆ ప్రాంత విద్యార్థులు బడికి దూరమయ్యారు. గత ఎన్నికల సమయంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చేలా ఈ పాఠశాలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పాఠశాలను మూసివేసిన తర్వాత చిన్న పిల్లలను దూర ప్రాంతాలలోని పాఠశాలకు పంపించలేక తల్లిదండ్రులు పాఠశాల మానిపించివేసినట్లు తెలిపారు. క్యాబిన్‌పేటలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, సామాజికవర్గాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పేద పిల్లలకు మెరుగైన విద్య సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. త్వరలోనే ఈ పాఠశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానునట్లు చెప్పారు. తల్లిదండ్రులు కూడా ఆలోచించి పిల్లలను బడికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.శ్రీనివాసరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు జాగర్లమూడి సుధీర్, గోగినేని రజనీకుమార్, పొన్నగంటి సుబ్బారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను కలిసి వేడుకుంటున్న పొదుపు మహిళలు

బోగస్ రుణాలు పొందినవారిని శిక్షించాలి

● ఎమ్మెల్యేకు పొదుపు సంఘాల మహిళల వినతి

పొన్నూరు టౌన్, జూలై 31: తమ పేరుతో బోగస్ పొదుపు సంఘాలను సృష్టించి అక్రమంగా రుణాలు పొందిన వ్యక్తులను శిక్షించటంతోపాటు, తమకు న్యాయం చేయాలని మెప్మా విభాగంలోని పొదుపు మహిళలు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను కోరారు. బుధవారం పట్టణంలోని 8వ వార్డు క్యాబిన్‌పేటలో పొదుపు మహిళలు ఎమెల్యే నరేంద్ర కుమార్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మెప్మా విభాగంలో పనిచేసే సిబ్బంది తమ పేరుతో బోగస్ గ్రూపులు సృష్టించటమే కాకుండా తమను మభ్య పెట్టి సంతకాలు చేయించుకుని తమ పేరుతో అక్రమమార్గంలో రుణాలు పొందారని తెలిపారు. ఈ రుణాలు తిరిగి చెల్లించకపోవటంతో బ్యాంక్ అధికారులు తమకు నోటీసులు అందించటమే కాకుండా తమతో అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్లు ఇతర పథకాల నగదును బ్యాంక్ అధికారులు ఈ రుణాల కింద జమ చేసుకుని తమను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. తమ పేరుతో పలు వార్డుల్లో 3,4 గ్రూపులు ఏర్పాటు చేశారన్నారు. ఈ మహిళల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే బోగస్ గ్రూపుల ఏర్పాటుపై మెప్మా అధికారులు విచారణ నిర్వహిస్తున్నారన్నారు. అలాగే ఈ గ్రూపుల సృష్టి వెనక అనేకమంది ఉనట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకాకాని, జులై 31: రోడ్డు ప్రమాదంలో పొన్నూరుకు చెందిన సీహెచ్ శ్రీనివాసరావు (28) మృతి చెందినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. పొన్నూరుకు చెందిన సీహెచ్ శ్రీనివాసరావు, మన్నెం కోటయ్య, పోలేశ్వరరావు ముగ్గురు స్నేహితులు. కోటయ్యకు చెందిన మినీ వాహనంలో నరసరావుపేట నుంచి కంచికచర్లలో లోడ్ దించేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో తక్కెళ్లపాడు వై జంక్షన్ సమీపంలో ఆగి ఉన్న లారీని మినీ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

సంగం లాభాలు బోనస్ రూపంలో రైతులకే పంపిణీ

● డైరెక్టర్ రామారావు

పొన్నూరు టౌన్, జూలై 31: సంగం డెయిరీ ఆర్జిస్తున్న లాభాలను తిరిగి బోనస్ రూపంలో రైతులకే అందిస్తునట్లు ఆ సంస్థ పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ములుకుదురులో బుధవారం పాల రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. 99మంది రైతులకు రూ.2,36,403 బోనస్‌ను అందచేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అనుక్షణం పాల రైతుల సంక్షేమం కోసమే పాటుపడుతున్నారన్నారు. సంగం డెయిరీ అర్జించిన లాభాలను రైతులకే చెందేలా బోనస్ రూపంలో పంచిపెడుతునట్లు తెలిపారు. పశుభీమాతోపాటు పాల రైతుల కోసం డీవీసీ అభయ సంక్షేమ పథకాలను అమలు చేస్తునట్లు వివరించారు. కార్యక్రమంలో అప్పికట్ల చిల్లింగ్ సెంటర్ మేనేజర్ క్రాట నరేష్‌బాబు, కోఆర్డినేటర్ ముప్పవరపు సుధీర్‌బాబు, పాలకవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు హర్షణీయం

తెనాలి అర్బన్, జూలై 31: ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం హర్షణీయమని బీజేపీ అధికార ప్రతినిధి అనంతాచార్యులు పేర్కొన్నారు. గంగానమ్మపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకానికి మహనీయురాలు డొక్కా సీతమ్మ పేరు పెట్టడం ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్లు అని చెప్పారు. విద్యాకానుక పథకానికి విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం పేరుతో పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించడం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. హెల్త్ యూనివర్శిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించటంపై అభినందించారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు అందించాలి

● ఎంపీడీవోకు బీజేపీ నాయకుల వినతి

పొన్నూరు టౌన్, జూలై 31: అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మండల పరిషత్ అధికారులను కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రత్నజ్యోతిని బీజేపీ నాయకులు కలిసి వినతిపత్రం అందచేశారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, ప్రధానమంత్రి కౌషల్ వికాస్ యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమయోజన, ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన వంటి పథకాలు అర్హులందరికీ అందాలని కోరారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రామిశెట్టి గోపి, చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు, కలపాల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకటకృష్ణారావు, గురుబాలు, ఆకాష్, శివకుమార్, దేవరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేస్తున్న చిరుద్యోగి మోహనరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

స్విచ్‌మెన్‌కు సత్కారం

పొన్నూరు టౌన్, జూలై 31: ప్రజల మన్ననలు పొందటమే ఉద్యోగుల ప్రతిభకు తార్కాణం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పురపాలక సంఘంలో సుదీర్ఘకాలం స్విచ్ మెన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మోహనరావుకు బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌తోపాటు, పట్టణ ప్రముఖులు తరలివచ్చి మోహనరావు సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్, టీడీపీ నాయకులు ఆకుల సాంబశివరావు, ఎ.చంద్రమోహన్, పఠాన్‌అహ్మద్‌ఖాన్ లక్ష్మీనారాయణ చౌదరి తదితరులతోపాటు పురపాలక సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు.